Follow: @ANNTELUGU

09-10-2026

ANN తెలుగు

# మహా పత్రిక

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 258 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM





## షాడో ఎస్పీ..



- జిల్లాకు ఎస్పీలాగా వ్యవహరిస్తున్న.. స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి
- అన్నింట్లో తలదూరుస్తూ.. ఎస్పీ పేరుతో చెలామణి
- ఇటీవల సీఎం పర్యటన భద్రత పర్యవేక్షణలో.. ఎస్బి డిఎస్ పి తీవ్ర వైఫల్యం
- డిఎస్పి పెత్తనం ఏందంటూ.. జిల్లా ఎస్పీని ప్రశ్నించిన ఐపీఎస్ లు
- డిఎస్పి పై, డిజిపి సివి ఆనంద్ చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్

02

టాప్ న్యూస్

## బీసీలే మా వెన్నెముక వారి రిజర్వేషన్లలో రాజీ లేదు



- మంత్రి నారా లోకేశ్

03

## కూటమి ప్రభుత్వం యువత భవిష్యత్తుతో ఆడుకుంటోంది



- వైసీపీ అధికార ప్రతినిధి శ్యామల ఫైర్

03

## బై బర్త్ నేను హైదరాబాదీ



- ఈసారి బతుకమ్మతో ధూంధాం
- తెలుగు అబ్బాయినే పెళ్ళి చేసుకుంటా
- ప్రముఖ నటి నిధి అగర్వాల్

03



### సుప్రీం తీర్పు తర్వాతే

## బ్యాలెట్‌తోనే లోకల్ వార్

- ఏర్పాట్లు పూర్తి చేశామన్న ఏపీ ఎస్ఈసీ అనిల్‌చంద్ర పునేఠా
- దశలవారీగా ఎన్నికలుంటాయని వెల్లడి

**అమరావతి, మహా :** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) సన్నద్ధమైంది. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే ఎన్నికల ప్రక్రియను వేగంగా ముందుకు మిగతా 3వ పేజీలో

### గోదావరి-కావేరి అనుసంధానంతో దక్షిణాదిలో

# అద్భుత ఫలితాలు

- కేంద్రం చొరవ, రాష్ట్రాల సమన్వయంతో నీటి కష్టాలకు చెక్
- గోదావరి పుష్కరాల నిర్వహణకు ప్రత్యేక నిధులివ్వండి
- ప్రధాని మోదీతో భేటీలో సీఎం చంద్రబాబు ప్రతిపాదనలు
- రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు, ఆర్థిక పరిస్థితిపై ప్రధానికి వివరించిన సీఎం
- 25 ఏళ్ల పాలనా ప్రస్థానంపై ప్రధాని మోదీకి శుభాకాంక్షలు తెలిపిన సిఎం




**ఢిల్లీ, మహా :** 25 ఏళ్ల పాలనా ప్రస్థానంపై ప్రధాని నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. దేశ సేవలో అరుదైన ఘనత సాధించిన ప్రధాని మోదీ సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ముఖ్యమంత్రిగా, ప్రధాన మంత్రిగా స్ఫూర్తిదాయక నాయకత్వాన్ని చూపారని, క్రమశిక్షణ, నిబద్ధతతో దేశానికి సేవలు అందించారని అన్నారు. దూరదృష్టి... స్పష్టమైన లక్ష్యం..... ధృడమైన నిర్ణయాలు...సమర్థవంతమైన పాలనతో భారత్‌ను ప్రపంచ శక్తిగా మలిచారని కీర్తించారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో భారత దేశ గమనాన్ని మర్చారని సిఎం చంద్రబాబు అన్నారు. ముఖ్యంగా సమాఖ్య స్ఫూర్తితో రాష్ట్రాలను భాగస్వాములుగా చేసి వికసిత్ భారత్ వైపు దేశాన్ని నడిపిస్తున్నారని అన్నారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో భారత్ గౌరవాన్ని, విశ్వసనీయతను మరింత పెంచేలా తోడ్పడ్డారని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రప్రజల తరుపున ఈ సందర్భంగా ప్రధానికి సీఎం శుభాకాంక్షలు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో జరిపిన భేటీలో మిగతా 2వ పేజీలో

## ఏపీకి పెట్టుబడుల వెల్లువ

- రూ.22.6 లక్షల కోట్లు సమీకరించాం : సీఎం చంద్రబాబు



**ఢిల్లీ,మహా:** ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' నుంచి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' దశకు ఏపీ మారుతోందని, ప్రపంచ పెట్టుబడిదారులకు ఇదే సరైన సమయమని ముఖ్యమంత్రి చంద్రబాబు మిగతా 2వ పేజీలో



## మోదీ గద్దె దిగు..

# లేకుంటే ప్రజలే దింపుతారు

- జనాభా 140 కోట్లు దాటితే 13 కోట్ల ఓట్ల గల్లంతు ఎలా?
- దళితులు, మైనారిటీలు, ఆదివాసీల ఓట్ల తొలగింపు వెనుక భారీ కుట్ర
- ఈడీ, ఐటీ, సీబీఐ దాడులు బీజేపీ ప్రభుత్వాన్ని రక్షించలేవు
- ఓటు బచావో... దేశ్ బచావో ప్రదర్శనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**ఢిల్లీ, మహా :** ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకుని దొడ్డిదారిన అధికారాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తే ప్రజలు తిరుగుబాటు చేస్తారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఈడీ, ఆదాయపు పన్ను శాఖ, సీబీఐ దాడులు ఇకపై బీజేపీ ప్రభుత్వాన్ని ఏమాత్రం రక్షించలేవన్నారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెంటనే భర్తరఫ్ చేయాలని సీఎం డిమాండ్ చేశారు. అలా చేయకుంటే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన గద్దెను ఖాళీ చేయాలని, లేకపోతే ప్రజలే ఆయనను గద్దె దించుతారని సీఎం అన్నారు. ఓటు బచావో... దేశ్ బచావో ఉద్యమంలో భాగంగా విపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గె, మిగతా 2వ పేజీలో

## అధికారంలోకి వచ్చేది మేమే

- కర్ణాటక నుంచి నీళ్లు తెచ్చినట్లు, మంత్రులు డ్రామా చేశారు
- రిజర్వాయర్ల కెపాసిటీ పెంపు, జేబులు నింపుకునేందుకే
- మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ
- బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఎంపీ డీకే అరుణ.



02



## వచ్చేది మరో ఎండాకాలమే

- ముందుంతా మండే కాలమే
- రాష్ట్రంలో రానున్న రోజుల వాతావరణంపై ఐఎండీ అలర్ట్

**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. సాధారణం కన్నా 3 నుంచి 5 డిగ్రీల ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. దీంతో ఉక్కపోత వాతావరణం నెలకొని జనం అసౌకర్యానికి మిగతా 2వ పేజీలో




## జీఎస్టీ నిబంధనలు సరళం

అధికారుల అధికారాలకు కత్తెర వ్యాపారులకు ఊరట

02




## చలో లోక్ భవన్ ఉద్రిక్తం

కాంగ్రెస్ ఇన్ ఛార్జి సచిన్ సావంత్, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, ఎంపీ వేం నరేందర్ రెడ్డితో పాటు మంత్రుల అరెస్ట్ 03

నిరసనలో పాల్గొని నినదించిన ఇండీకూటమి నేతలు



## కేటీఆర్ దమ్ముంటే నాపై పోటీచెయ్

ఖైరతాబాద్ పై దానం సవాల్

02









## బై బర్త్ నేను హైదరాబాదీ

హైదరాబాద్, మహా : వరుస ఓపెనింగ్ లతో సందడి చేస్తున్న నిధి అగర్వాల్ హైదరాబాద్‌లో ఓ షాపింగ్ మాల్ ఓపెనింగ్ అనంతరం మీడియాతో మాట్లాడింది. వారి ప్రశ్నలకు సమాధానం ఇచ్చింది. ఈ క్రమంలోనే మీ పెళ్లి ఎప్పుడు? తెలుగు అబ్బాయినే పెళ్లి చేసుకుంటారా? అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు. దీనికి నిధి అగర్వాల్ సమాధానం చెబుతూ.. నేను హైదరాబాద్‌లోనే పుట్టా.. బై బర్త్ నేను తెలుగు అమ్మాయినే. రీసెంట్‌గానే ముంబై నుంచి హైదరాబాద్‌కు షిఫ్ట్ అయ్యా.. ఈసారి బతుకమ్మ పండుగని సెలబ్రేట్ చేసుకుంటాను. నాకు తెలుగు అబ్బాయిలంటే ఇష్టమే.. బహుశా నేను ఇక్కడి అబ్బాయినే పెళ్లి చేసుకోవచ్చు అని ఆన్సర్ ఇచ్చింది నిధి. ప్రస్తుతం ఆమె వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి







## కేటీఆర్ దమ్ముంటే నాపై పోటీచెయ్

### ఖైరతాబాద్ పై దానం సవాల్

**ఖైరతాబాద్, మహా :** ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక జరగనున్న నేపథ్యంలో రాజకీయ వాతావరణం హాట్ హాట్ గా మారింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ గురువారం సంచలన సవాల్ విసిరారు. గురువారం ఇండీ కూటమి చేపట్టిన 'సేవ్ డెమోక్రసీ' ర్యాలీలో పాల్గొన్న దానం మాట్లాడుతూ.. ఖైరతాబాద్‌లో తనపై బరిలోకి దిగి పోటీ చేయాలని కేటీఆర్‌కు ఆయన ఓపెన్ ఛాలెంజ్ చేశారు. బై ఎలెక్షన్‌కు తాను పూర్తిగా సిద్ధంగా ఉన్నానని, ఈ పోరులో తాడోపేడో తేల్చుకుందామని కామెంట్ చేశారు. దానం నాగేందర్ అంటేనే ఓ బ్రాండ్ అని ధీమా వ్యక్తం చేశారు. ఖైరతాబాద్ ఉప ఎన్నిక తమ ప్రభుత్వ పాలనకు రెఫరెండం కాబోతోందని పేర్కొన్నారు.

# షాడో ఎస్పీ..



**కరీంనగర్ క్రైమ్ బ్యూరో , మహా** : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని, ఓ జిల్లాకు చెందిన స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ వ్యవహారం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఇటీవలే డీఎస్పీగా ప్రమోషన్ పొందిన సదురు పోలీసు అధికారి, ఆజిల్లాకు షాడో ఎస్పీలాగా వ్యవహరిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. స్పెషల్ బ్రాంచ్ డ్యూటీని వదిలేసి, అన్నింటిలో తానే జోక్యం చేసుకోవడం, ఆ జిల్లాకు ఆయనే బాస్ అన్నట్లుగా సదురు అధికారి పనితీరూ ఉండటంతో, ఆ జిల్లాకు పోలీసు బాస్ ఎవరూ అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇటీవల సీఎం పర్యటన సందర్భంగా, సదురు డిఎస్పి ని నమ్మి జిల్లా పోలీస్ బాస్ పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించడంతో, అవగాహనా లేని డిఎస్పి వ్యవహారంతో పోలీస్ బాస్, సీఎంఓ, ఐఎస్ డబ్ల్యూ అధికారులతో చివాట్లు ఎదురుకున్నారు. డిఎస్పి ని నమ్ముకుని ఎలా సాక్షాత్తు సీఎం భద్రతా సమన్వయం చేస్తారని తోటి ఐపీఎస్ లు సైతం సదురు ఎస్ పిని ప్రశ్నించినట్లు సమాచారం. అంతే కాకుండా జిల్లా వ్యాప్తంగా ఎస్ బి సిబ్బంది నుంచి మామ్ముళ్లు సదురు డిఎస్ పి నెల నెల వసూళ్లు చేయడం.. తీవ్ర ఆరోపణలకు దారి తీస్తుంది. ఇలాంటి డిఎస్ పిని.. జిల్లా ఎస్ పి గుడ్డిగా నమ్మి, పరిపాలన బాధ్యతలు అయనకు అప్పగించడం తో, ఎస్బి డిఎస్పీ ఆ జిల్లా కు షాడో ఎస్ పి లాగా వ్యవహరించడంపై ప్రభుత్వం సైతం సీరియస్ గా ఆ వ్యవహారాన్ని పరిగణిస్తున్నట్లు తెలిసింది. సీఎం భద్రత పర్యవేక్షణలో తీవ్ర వైఫల్యం చెందిన ఎస్బి డిఎస్ పి పై, రాష్ట్ర డిజిపి చర్యలు తీసుకోవాలని ఆ జిల్లా ప్రజలు కోరుతున్నారు

## హైదరాబాద్ లో సినీ నటి భాగ్యశ్రీ బోర్సే సందడి

హైదరాబాద్ : సినీ నటి భాగ్యశ్రీ బోర్సే ఇటీవల హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో జరిగిన జీవీ మాల్ గ్రాండ్ ఓపెనింగ్ కార్యక్రమంలో పాల్గొని సందడి చేశారు. ఈ ప్రారంభోత్సవ వేడుకకు విచ్చేసిన ఆమె, మాల్‌లోని వివిధ విభాగాలను పరిశీలిస్తూ సందడి చేయగా, ఆమెను చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.











# ఏపీకి పెట్టుబడుల వెల్లువ



**( మొదటి పేజీ తరువాయి )**

పిలుపునిచ్చారు. నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు హాజరు కావాలని ఆయన గ్లోబల్ ఇన్వెస్టర్లను ఆహ్వానించారు. గురువారం ఢిల్లీలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి చంద్రబాబు ఈ సదస్సు కర్టెన్ రైజర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూన్ 2024 నుంచి ఇప్పటివరకు రాష్ట్రానికి రూ. 22.6 లక్షల కోట్ల విలువైన 714 ప్రాజెక్టుల రూపంలో పెట్టుబడులు వచ్చాయని వెల్లడించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలోని యువతకు 7.1 లక్షల ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని ఆయన తెలిపారు. సాంకేతికత ఆధారిత పాలనతో వ్యాపార అనుమతులు, ప్రక్రియలను వేగవంతం చేస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రతి రంగంలోనూ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని చంద్రబాబు వివరించారు. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ, రాయలసీమలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్, అమరావతిలో క్వాంటం వ్యాలీ, గ్రీన్ హైడ్రోజన్ ఎకోసిస్టమ్స్ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులతో ఏపీని ఉన్నత స్థాయికి తీసుకెళ్తున్నామని అన్నారు. "వేగం, విస్తరణ, స్థిరత్వం చోదకాలుగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌తో భాగస్వాములు కండి. రాష్ట్ర ప్రగతిలో పాలుపంచుకోండి" అని ప్రపంచ వ్యాపార నాయకులను, పెట్టుబడిదారులను చంద్రబాబు కోరారు. విశాఖ సదస్సు ఏపీ అభివృద్ధి ప్రస్థానంలో ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## గోదావరి-కావేరి అనుసంధానంతో దక్షిణాదిలో

# అద్భుత ఫలితాలు

**( మొదటి పేజీ తరువాయి )**

ముఖ్యమంత్రి కీలక అంశాలను ప్రస్తావించారు. ఈ భేటీలో రాష్ట్రాభివృద్ధికి చెందిన వివిధ కీలక ప్రాజెక్టులు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, వ్యవసాయ, ఇరిగేషన్ వంటి అంశాలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. నీటిపారుదల రంగానికి సంబంధించి పోలవరం ప్రాజెక్టు తాజా నివేదికతో పాటు గోదావరి కావేరి నదుల అనుసంధానం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రధాని మోదీకి సీఎం చంద్రబాబు వివరించారు. గోదావరి-కావేరి నదుల అనుసంధానం జరిగితే దక్షిణాదిలోని ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సమృద్ధిగా నీరు అందుతుందని ముఖ్యమంత్రి వివరించారు. దేశవ్యాప్తంగా రహదారుల నెట్ వర్క్, పవర్ గ్రిడ్ వంటివి ఎన్డీఏ ప్రభుత్వాల హయాంలోనే జరిగాయని... ఇప్పుడు నదుల అనుసంధాన ప్రాజెక్టును ముందుకు తీసుకువెళితే వాటర్ గ్రిడ్ ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుందని సీఎం చంద్రబాబు వివరించారు. 2027లో జరిగే గోదావరి పుష్కరాలకు రాష్ట్రంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. పుష్కరాల కోసం చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులకు ఆర్థిక సాయం అందించాలని ప్రధానిని సిఎం కోరారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా...దేశ విదేశాల నుంచి సైతం గోదావరి పుష్కరాలకు భక్తులు తరలి వస్తారని సీఎం వివరించారు.



**రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం**

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో 53 శాతం లోటు వర్షపాతం నమోదైందని...ఇది వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపించిందని ప్రధానికి సిఎం వివరించారు. కరువు నష్టాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వ పరంగా తీసుకుంటున్న చర్యలను ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల కేంద్ర సహకారంతో మదనపల్లె కేంద్రంగా ప్రారంభించిన గ్లోబల్ హార్టికల్చర్ హబ్ లక్ష్యాలను కూడా ప్రధానికి తెలిపారు. అలాగే ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ తరహాలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశామని వెల్లడించారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు కేంద్ర సహకారాన్ని సీఎం కోరారు. రాజధాని అమరావతిలో చేపడుతున్న ఔటర్ రింగ్ రోడ్డు వంటి అంశాలపై సీఎం చంద్రబాబు ప్రధాని మోదీతో చర్చించారు. విశాఖ మెట్రోను మంజూరు చేయాలని సిఎం కోరారు. అలాగే బీచ్ రోడ్డు నిర్మాణం గురించి వివరించారు. 2047 నాటికి రాష్ట్రంలో అందరికీ అభివృద్ధి ఫలాలు సమానంగా అందేలా అమలు చేస్తున్న స్వర్ణాంధ్ర - 2047 విజన్ గురించి ప్రధానికి సీఎం తెలిపారు.

## జీఎస్టీ నిబంధనలు సరళం

### అధికారుల అధికారాలకు కత్తెర వ్యాపారులకు ఊరట

**ఢిల్లీ,మహా :** జీఎస్టీ అధికారులకు ఉన్న అరెస్ట్ అధికారాలను రద్దు చేస్తూ జీఎస్టీ మండలి కీలక నిర్ణయం తీసుకుంది. ప్రాసిక్యూషన్ ప్రారంభించే పరిమితిని కోటి రూపాయల నుంచి 5 కోట్ల రూపాయలకు పెంచింది. ఈ మేరకు ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన జీఎస్టీ మండలి సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కనీస శిక్ష అనే నిబంధనను జీఎస్టీ చట్టం నుంచి తొలగిస్తున్నట్లు కేంద్ర మంత్రి ప్రకటించారు. జరిమానా, జైలు శిక్ష లేదా రెండూ అనే అంశాన్ని ప్రతి కేసులోనూ న్యాయస్థానాల విచక్షణాధికారానికే వదిలేసినట్లు తెలిపారు. సాధారణ జరిమానాను 25 వేల నుంచి 10వేలకు తగ్గిస్తూ జీఎస్టీ మండలి నిర్ణయం తీసుకున్నట్లు నిర్మలా సీతారామన్ చెప్పారు. 10వేల రూపాయల కంటే తక్కువ ఉన్న పన్నులకు ఎలాంటి డిమాండ్ నోటీసులు పంపబోరని పేర్కొన్నారు. ఇది మొత్తం కేసుల్లో దాదాపు 20 శాతం వరకు భారం తగ్గిస్తుంది. ట్యాక్స్ రేట్లలో మార్పులను ఇకపై ఏడాదికి ఒకసారే, అది కూడా ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే అమలు చేసేలా ప్రతిపాదనలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ప్రస్తుత సమావేశంలో పన్ను రేట్లపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఇకపై జీఎస్టీ రేట్లలో మార్పులు ఏడాదికి ఒకసారే ఉంటాయని స్పష్టం చేశారు. "రేట్ల అంశం ఇప్పటికే ఖరారైంది. రోజువారీ అంశాలపై కౌన్సిల్ ఈసారి దృష్టి సారించింది. ఏడాదికి ఒకసారి జీఎస్టీ రేట్లలో మార్పులు జరుగుతాయి" అని ఆర్థిక మంత్రి వెల్లడించారు. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ క్లెయిమ్‌ల అంశాన్ని పరిశీలించేందుకు ఆఫీసర్లతో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సప్లయర్‌కు పూర్తి మొత్తం చెల్లించి ఉత్పత్తులు, తగిన ఇన్‌వాయిస్‌లు కలిగిన బయ్యర్లను ఎలా రక్షణ కల్పించాలనే దానిపై ఆఫీసర్లు మూడు నెలల్లో నిర్ణయం తీసుకుంటారని వివరించారు. తదుపరి జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో దీనిపై చర్చిస్తామని పేర్కొన్నారు. ఇకామర్స్ ప్లాట్‌ఫాంలో ఉత్పత్తులను విక్రయించుకునే చిన్న వ్యాపారులకు ఊరటనిచ్చేలా నిబంధనలను సులభతరం చేసేందుకు జీఎస్టీ మండలి ఆమోదం తెలిపినట్లు వివరించారు. ఇకామర్స్‌లో విక్రయించే చిరు వ్యాపారుల రిజిస్ట్రేషన్ మెకానిజాన్ని సులభతరం చేశారు. అలాగే, సాధారణ జరిమానాను రూ.25 వేల నుంచి రూ.10 వేలకు తగ్గించారు. దీనివల్ల వేరే రాష్ట్రాల్లో స్వంత గోడౌన్లు లేని చిన్న సెల్లర్లు, ఆయా ఈకామర్స్ సంస్థల వేర్‌హౌస్‌లను తమ రిజిస్టర్డ్ వ్యాపార స్థలంగా ఉపయోగించుకునే అవకాశం ఉంది. ఫలితంగా సుమారు 9.5 లక్షల మంది చిన్న వ్యాపారులు దేశవ్యాప్తంగా తమ మార్కెట్‌ను విస్తరించుకునేందుకు వీలవుతుంది.



## మోదీ గద్దె దిగు.. లేకుంటే ప్రజలే దింపుతారు

**● (మొదటి పేజీ తరువాయి )**



కాంగ్రెస్ సీనియర్ నేతలు ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, ఇండియా కూటమి నేతలు గురువారం మహాత్మా గాంధీ సమాధి రాజ్‌ఘాట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. రాజ్‌ఘాట్ వద్ద నివాళుల అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఓటు బచావో... దేశ్ బచావో ఉద్యమం కాంగ్రెస్ పార్టీ పోరాటం కోసమో, ఇండియా కూటమి కోసమో కాదని, దేశంలోని సామాన్యుల హక్కుల పరిరక్షణ ఉద్యమమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 2014 ఎన్నికల నాటికి దేశంలో 81 కోట్ల మంది ఓటర్లు ఉంటే, 2019 నాటికి ఆ సంఖ్య 91 కోట్లకు చేరిందని సీఎం గుర్తుచేశారు. 2024 నాటికి 97 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని సీఎం తెలిపారు. దేశ జనాభా 140 కోట్లకు చేరుకుందని, ఓటర్ల సంఖ్య మరింతగా పెరగాల్సింది పోయి ఏకంగా 13 కోట్ల ఓట్ల గల్లంతు అయ్యాయని, అవి ఎలా తగ్గిపోయాయో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు తెలియజేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు.

మహాత్మా గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ పటేల్, భగత్ సింగ్ వంటి వారు ప్రాణాలకు తెగించి పోరాడారని, స్వాతంత్ర్యం తెచ్చారని సీఎం అన్నారు. సంపన్నులు, పేదలు తేడా లేకుండా డాక్టర్ అంబేడ్కర్ ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించారన్నారు. ఇప్పటి వరకు సర్ ఎన్నిసార్లు జరిగినా పేదల ఓట్లకు ముప్పు కలగలేదని సీఎం అన్నారు. ఇప్పుడు మాత్రం రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును అణగారిన వర్గాల నుంచి గుంజుకునేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఈసీ జ్ఞానేష్ కుమార్ ప్రయత్నిస్తున్నారని సీఎం ఆరోపించారు. ఎన్నికల సంఘం తప్పులను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నేతలపై పోలీసులతో దాడులు చేయించడం, ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన నేతలను ఎన్నికల సంఘం కలవకపోవడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని సీఎం మండిపడ్డారు.

కులం, మతం, ప్రాంతం, భాషల పేరుతో దేశ ప్రజలను విభజించి బీజేపీ అధికారంలోకి వచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. దేశ ప్రజలను ఓటు ఉన్నవాళ్లు, ఓటు లేనివాళ్లుగా, రెండు వర్గాలుగా విభజిస్తున్నారని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీకి అనుకూలంగా ఉన్న వాళ్లు ఒకవైపు, వ్యతిరేకంగా ఉన్న పేదలు మరో వైపు అన్నట్లుగా మోదీ, జ్ఞానేష్ కుమార్ పరిస్థితులను మార్చారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీకి వ్యతిరేకంగా తీర్పునిచ్చే దళితులు, గిరిజనులు, ఆదివాసీలు, మైనారిటీ ఓట్లను లక్ష్యంగా చేసుకొని వాటిని తొలగిస్తున్నారని సీఎం ఆరోపించారు.

# అధికారంలోకి వచ్చేది మేమే

- కర్ణాటక నుంచి నీళ్లు తెచ్చినట్లు, మంత్రులు డ్రామా చేశారు
- రిజర్వాయర్ల కెపాసిటీ పెంపు, జేబులు నింపుకునేందుకే
- మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ
- బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఎంపీ డీకే అరుణ.



**గద్వాల, మహా** : రిజర్వాయర్ల సామర్థ్యం పెంపు పేరుతో కాంగ్రెస్ నేతలు జేబులు నింపుకునే ప్రయత్నం చేస్తున్నారని మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ ఆరోపించారు. మూడేళ్లలో.. పెండింగ్ ప్రాజెక్టులలో తట్టెడు మట్టి కూడా ఎందుకు తీయలేదని ప్రశ్నించారు. రిజర్వాయర్ల పనులను రెండేళ్లలో పూర్తి చేస్తారా అని నిలదీశారు. గద్వాల జిల్లా గట్టు మండలంలో బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన ఎంపీ కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వకుండా కేవలం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు మాత్రమే ఇళ్లు ఇస్తోందని విమర్శించారు. దీనిని ప్రజా ప్రభుత్వం అంటారా అని ప్రశ్నించారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో అర్హులందరికీ పార్టీలు చూడకుండా ఇళ్లు ఇచ్చామని తెలిపారు. గద్వాల మున్సిపాలిటీలో పన్నుల పేరుతో కోట్ల రూపాయలు వసూలు చేస్తూ, లెక్కల్లో మాత్రం లక్షల రూపాయలుగా చూపిస్తున్నారని ఆరోపించారు. ఇలా కొనసాగితే గద్వాల్‌ను నాలుగు రోజుల్లోనే అమ్మేస్తారని తీవ్రంగా విమర్శించారు.

నీటి విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. రాత్రికి రాత్రే మంత్రులు కర్ణాటకకు వెళ్లి డ్రామా చేశారని విమర్శించారు. వర్షాలతో వచ్చిన నీటిని కర్ణాటక ప్రభుత్వం విడుదల చేసిన నీరుగా అబద్ధపు ప్రచారం చేసి ప్రజలను మోసం చేశారని అన్నారు. కర్ణాటక ప్రభుత్వం తెలంగాణకు చుక్క నీరు కూడా విడుదల చేయలేదని పేర్కొన్నారు. నీటి కోసం రైతులు ఆందోళనలు చేస్తే వారిపై కేసులు నమోదు చేస్తున్నారని డీకే ఆరోపించారు. డబ్బులతో ఓట్లు కొనుగోలు చేసి గతంలో గద్వాల్‌లో టీఆర్ఎస్ గెలిచిందని విమర్శించారు. ఎమ్మెల్యేలు ప్రజలకు సేవ చేయడానికి కాకుండా సంపాదించుకోవడానికే వచ్చామని భావిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. బీజేపీ ప్రతి ఒక్కరి గుండెల్లో ఉందని, తెలంగాణలో తదుపరి అధికారంలోకి వచ్చేది బీజేపీయేనని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువ నాయకురాలు డీకే స్నిగ్ధారెడ్డి, జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బండల వెంకటరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఎక్బోటే, జిల్లా ఉపాధ్యక్షుడు బలిగేరా నల్లారెడ్డి, జిల్లా కోశాధికారి మీర్జాపురం రామచంద్రారెడ్డి, గద్వాల్ పోటీ చేసిన అభ్యర్థి బలిగేరా శివారెడ్డి, రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి అక్కల రమాదేవి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బాబుల్‌రెడ్డి, ఓబీసీ మోర్చా నాయకులు దాస్, మండల అధ్యక్షుడు గట్టు సురేష్, కౌన్సిలర్లు శాలన్న, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వచ్చేది మరో ఎండాకాలమే

**( మొదటి పేజీ తరువాయి )**

గురవుతున్నారు. రాబోయే రోజుల్లో వాతావరణ పరిస్థితులు ఈ విధంగానే కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. అలాగే తెలంగాణ నుంచి నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రారంభమైందన్నారు. ఇవాళ ఉత్తర, మధ్య తెలంగాణ నుంచి నిష్క్రమించిన నైరుతి రుతుపవనాలు, రేపటికల్లా పూర్తిస్థాయిలో తిరోగమనమవుతాయని ఆయన తెలిపారు.




# పోలీసుల గస్తీ తోనే ప్రజల భద్రతకు భరోసా

- పోలీస్ శాఖ ప్రతిష్టకు సిబ్బంది పనితీరే ప్రామాణికం
- వరంగల్ సీపీ ఎన్ శ్వేత, ఐపీఎస్

**హనుమకొండ, మహా;** వార్షిక తనిఖీలో భాగంగా హనుమకొండ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతా ఐపీఎస్.సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత పూల మొక్కను అందజేసి సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఎస్సై సతీష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, స్టేషన్ పరిసరాలు, సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలను కమిషనర్ క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి పోలీస్ శాఖ ప్రతిష్ఠ అనేది గస్తీ విధులు నిర్వహించే సిబ్బంది పనితీరు పైనే ఆధారపడి ఉంటుందని. గస్తీ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, ప్రజల భద్రతకు భరోసా కల్పిస్తూ విధులు నిర్వహించినప్పుడే పోలీస్ శాఖపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని. సిబ్బంది సమర్థవంతమైన విధుల నిర్వహణతో పోలీస్ శాఖ ప్రతిష్ఠ మరింత పెరుగుతుందని అని తెలిపారు. ప్రతి పోలీస్ సిబ్బంది తమకు అప్పగించిన విధులను అంకితభావంతో, క్రమశిక్షణతో నిర్వహించాలని, ప్రజలతో మర్యాదగా వ్యవహరిస్తూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా పనిచేయాలని సీపీ సూచించారు. నిత్యం విదుల్లో బిజీగా ఉండే పోలీసులు వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, పోలీసు సిబ్బంది వ్యక్తిగత క్రమశిక్షణతో పాటు ఆర్థిక క్రమశిక్షణకు అలవాటు పడినప్పుడే కుటుంబ భవిష్యత్తు బాగుంటుందని హితవు పలికారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మామిడి మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత, హనుమకొండ ఏసీపీ నరసింహారావు, ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్, ఎస్సై సతీష్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




# ప్రశ్నించే గొంతును నొక్కడం అప్రజాస్వామికం

- ఎమ్మెల్యే కొండా సురేఖ
- రాహుల్ గాంధీ అరెస్టు పై భగ్గుమన్న వరంగల్ తూర్పు
- ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిరసనగా భారీ ర్యాలీ

**పోచమ్మ మైదాన్ మహా :** ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు రక్షణ కోసం ప్రజల పక్షాన కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని మాజీ మంత్రి వరంగల్ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే కొండా సురేఖ తెలిపారు. ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత కోసం నినాదాలు చేస్తూ ఎమ్మెల్యే సురేఖ వరంగల్ తూర్పు కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధుల తో కలిసి వరంగల్ చౌరస్తా నుంచి పోచమ్మ మైదాన్ జంక్షన్ వరకు మాజీ కార్పొరేటర్లు, కాంటెస్టెడ్ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాదయాత్రలో పాల్గొన్నారు. పాదయాత్ర అనంతరం పోచమ్మ మైదాన్ జంక్షన్ లో రాణి రుద్రమదేవి విగ్రహానికి పూలమాల వేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండా సురేఖ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత పవిత్రమైనదని, ప్రతి ఓటు ప్రజల హక్కుకు ప్రతీక అని అన్నారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని మాజీమంత్రి సురేఖ గారు అన్నారు. ఓటు చోరీ, ఎన్నికల అక్రమాలకు సంబంధించిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ వ్యవహారశైలి పై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ఆయన వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని కొండా సురేఖ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని, ఓటు హక్కును కాపాడే వరకు తమ పోరాటం కొనసాగుతుందని సురేఖ స్పష్టం చేశారు. అలాగే కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టు కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి పరాకాష్ట అని నాయకులు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య హక్కుల కోసం ప్రశ్నించే గొంతులను అణచివేయడం సరికాదని, కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలని హితవు పలికారు. పరిరక్షణ, ఓటు హక్కు రక్షణ కోసం రాజకీయాలకు అతీతంగా ప్రజలందరూ ఐక్యంగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉండేలా ఎన్నికల వ్యవస్థ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా పనిచేయాలని మాజీ మంత్రి సురేఖ పేర్కొన్నారు.




# ఈనెల 11 నుంచి శ్రీ భద్రకాళి దేవి శరన్నవరాత్ర దసరా మహోత్సవాలు ప్రారంభం

రంగంపేట, మహా; ఓరుగల్లు ప్రజల ఆరాధ్య దైవం శ్రీ భద్రకాళీ దేవస్థానంలో ఈనెల 11 నుండి 21వ తేదీ వరకు శ్రీ భద్రకాళి దేవి శరన్నవరాత్ర దసరా మహోత్సవాలు నిర్వహించనున్నట్లు గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆలయ ఈవో రామల సునీత తెలిపారు. గురువారం ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారి శరన్నవరాత్ర దసరా మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈనెల 11 నుంచి 21వ తేదీ వరకు ఉత్సవాలు వైభవంగా జరుగుతాయన్నారు. ఆలయంలో మొట్ట మొదటిసారిగా కోటి రూపాయల ఖర్చుతో మాడవీధులలో ఏడవ రోజు రథోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. నీటి వసతి లేనందున తెప్పోత్సవం అంతరంగికంగా నిర్వహిస్తామని చెప్పారు. ఆలయంలో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం మంచి నీటి వసతులు, ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఆలయ ప్రాంగణంలో పాండాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోలీస్, మున్సిపల్, ఎండోమెంట్ ఇతర శాఖల సమన్వయంతో పనుల నిర్వహణ జరుగుతుందని చెప్పారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని ఈవో సునీత కోరారు. అలాగే ఆలయ అర్చకులు భద్రకాళి శేషు మాట్లాడుతూ.. దేవీ శరన్నవరాత్ర మహోత్సవాల విశిష్టతను, నిర్వహించబోయే కార్యక్రమాలను వివరించారు. ఈ సమావేశంలో ఆలయ సూపర్డెంట్ , పి ఆర్ ఓ, అర్చకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





# చలో లోక్ భవన్ ఉద్రిక్తం

( మొదటి పేజీ తరువాయి )

కాంగ్రెస్ ఇన్ ఛార్జి సచిన్ సావంత్, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, ఎంపీ వేం నరేందర్ రెడ్డితో పాటు మంత్రుల అరెస్ట్పైరసనలో పాల్గొని నినదించిన ఇండీకూటమి నేతలు

హైదరాబాద్, మహా : దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయంగా 'సేవ్ డెమోక్రసీ' పేరుతో ఇండీ కూటమి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో చేపట్టిన 'చలో లోక్‌భవన్' కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. నెక్లెస్ రోడ్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం ప్రారంభ ప్రాంతం నుంచి లోక్ భవన్ వరకు కూటమి నేతలు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ నిరసన ప్రదర్శనలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అజారుద్దీన్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, తదితర ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని కూటమి నేతలు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేస్తూ వారు ముందుకు కదిలారు. కూటమి నేతల ర్యాలీ లోక్‌భవన్ వద్దకు చేరుకునేసరికి భద్రతా కారణాల దృష్ట్యా పోలీసులు అప్రమత్తమయ్యారు. భారీ బారికేడ్లను




ఏర్పాటు చేసి నేతలను ముందుకు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, ఇండీ కూటమి నేతలకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి, అక్కడ కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో , పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, మంత్రులు లోక్ భవన్ ఎదుట నడిరోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. పార్టీ ఇన్ ఛార్జి సచిన్ సావంత్ కూడా ఆందోళనలో పాల్గొన్నారు. అనంతరం వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని డీసీఎంలోకి ఎక్కించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

**భగ్గుమన్న పీసీసీ చీఫ్**

సీఈసీ ఏకపక్ష తీరుపై పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ భగ్గుమన్నారు. లోక్ భవన్ ముట్టడికి వెళ్ళకుండా అడ్డుకోవడంపై ఆగ్రహించారు. సీఈసీ రాజీనామా చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. జ్ఞానేశ్ కుమార్ ప్రజాస్వామ్య హక్కులను కాలరాశారన్నారు.

# సుప్రీం తీర్పు తర్వాతే బ్యాలెట్‌తోనే లోకల్ వార్

( మొదటి పేజీ తరువాయి )

తీసుకెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా తెలిపారు. గత రెండు నెలలుగా ఎన్నికల సన్నద్ధతపై కసరత్తు చేస్తున్నట్లు వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికలను బ్యాలెట్ పేపర్ల ద్వారానే నిర్వహించనున్నట్లు పునేఠా స్పష్టం చేశారు. ఎన్నికల కోసం అవసరమైన బ్యాలెట్ బాక్సులు సిద్ధంగా ఉన్నాయని, బ్యాలెట్ పత్రాల ముద్రణకు సంబంధించిన ప్రింటింగ్ ప్రెస్‌ను త్వరలో ఖరారు చేయనున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికలకు 2026 ఫిబ్రవరి 5 నాటికి ఉన్న ఫొటో ఓటర్ల జాబితాను ప్రాతిపదికగా తీసుకోనున్నట్లు ఎస్ఈసీ తెలిపింది. ఎన్నికలను దశలవారీగా నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు పునేఠా పేర్కొన్నారు.ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా అధికారులు, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల ప్రతినిధులతో ఎస్ఈసీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. పోలింగ్ ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లు, అధికారుల సన్నద్ధతపై సమీక్షించారు. గత రెండు నెలలుగా ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు కొనసాగుతున్నాయని పునేఠా తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు కోసం ఎదురుచూస్తున్నామని ఎస్ఈసీ పేర్కొంది. తీర్పు వెలువడిన వెంటనే ఎన్నికల ప్రక్రియను వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ సిద్ధంగా ఉన్నాయని పునేఠా తెలిపారు






# స్టార్ లింక్ కు అడ్డంకులపై ఎలన్ మస్క్ ఆందోళన

- భారత్ కు బాస్ అంబానీనా అంటూ ప్రశ్నలు

**రాహుల్ సపోర్ట్** : మహా : భారత్‌లో తన స్టార్‌లింక్ అనుమతులకు జాప్యం ఏర్పడుతుందని ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ తీవ్ర ఆరోపణలు చేయడం సంచలనంగా మారింది. ఇదే కాకుండా..''భారత్‌కు నిజమైన బాస్ అంబానీనా?'' అంటూ ఆయన ట్వీట్ చేయడం చర్చనీయాంశమైంది. ఎలాన్ మస్క్ వ్యాఖ్యలకు కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పందించారు. ''వెల్‌కమ్ టూ ఇండియా ఎలాన్, మరొక వ్యక్తి ఎవరో తెలిసే వరకు వేచి చూడండి'' అంటూ కామెంట్ చేశారు. అయితే, ఆ మరో వ్యక్తి ఎవరనేది రాహుల్ గాంధీ ప్రస్తావించలేదు. కానీ, ఈ వ్యాఖ్యలు గౌతమ్ అదానీని ఉద్దేశించినవని చాలా మంది అనుకుంటున్నారు. చాలాసార్లు రాహుల్ గాంధీ అంబానీ, అదానీలను టార్గెట్ చేస్తూ విమర్శించారు. అదానీకి బీజేపీతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, ఆయనకు అనుకూలంగా వ్యవహరిస్తారని కాంగ్రెస్ గతంలో పలుమార్లు ఆరోపించింది. రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు ఎలాన్ మస్క్ స్పందిస్తూ.. ''థాంక్యూ రాహుల్. ఇది నిజంగా ఆందోళనకరమైన విషయం'' అని రిప్లై ఇచ్చారు. దీనికి ముందు ఎలాన్ మస్క్ భారత్‌లో స్టార్‌లింక్ అనుమతులు రావడంపై మస్క్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తమ సంస్థ 165కిపైగా దేశాల్లో లైసెన్స్ పొందిందని, భారత్‌లోని చట్టాలు, ప్రభుత్వ అవసరాలకు అనుగుణంగా ఐదేళ్లుగా పనిచేస్తున్నప్పటికీ ఇంకా లైసెన్స్ ఎందుకు రాలేదని ప్రశ్నించారు. ''అంబానీయే భారత్‌కు అసలైన బాస్‌నా?'' అని ఎక్స్‌లో ప్రశ్నించారు. దీనికి ముందు మరో పోస్టులో భారత్‌లో స్టార్‌లింక్ ప్రవేశాన్ని కొంతమంది ''ఒలిగార్కులు'' అడ్డుకుంటున్నారని, తమ గుత్తాధిపత్య ప్రయోజనాలు కాపాడుకోవడానికి ఇలా చేస్తున్నారని మస్క్ ఆరోపించారు. అయితే, మస్క్ ఆరోపణల్ని భారత్ తీవ్రంగా ఖండించింది. శాటిలైట్ కమ్యూనికేషన్ సేవల అనుమతుల వ్యవస్థ న్యాయమైందని, వివక్ష లేదని స్పష్టం చేసింది. భారత్ స్టార్‌లింక్‌తో పాటు రిలయన్స్ జియో యొక్క శాటిలైట్ వెంచర్ జియో సాట్‌కామ్ మరియు భారతి మద్దతు ఉన్న యూటెల్‌శాట్ వన్‌వెబ్‌లకు లైసెన్సులు మంజూరు చేసింది. అయితే, వీటికి అవసరమైన భద్రతా అంచనాలు, స్పెక్ట్రమ్ ఆమోదాలు పూర్తయ్యే వరకు వాణిజ్య సేవలు ప్రారంభించలేవు.

# బీసీలే మా వెన్నెముక .. వారి రిజర్వేషన్లలో రాజీ లేదు

**మంత్రి నారా లోకేశ్**

**అమరావతి, మహా :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకే తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఏపీ మంత్రి నారా లోకేశ్ మరోసారి స్పష్టం చేశారు. ఈ అంశం ప్రస్తుతం సుప్రీంకోర్టు పరిధిలో ఉందని, న్యాయస్థానం నుంచి తీర్పు వెలువడిన వెంటనే ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళతామని తెలిపారు. గురువారం ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇటీవల రద్దు చేసిన విషయం తెలిసిందే. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించరాదన్న సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఉటంకిస్తూ ఈ తీర్పు ఇచ్చింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో లోకేశ్ మాట్లాడుతూ... "తెలుగుదేశం పార్టీకి బీసీలే వెన్నెముక. వారి ప్రయోజనాలను కాపాడటంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదు" అని అన్నారు. రిజర్వేషన్లు ఇంకా ఖరారు కాకముందే నెల్లూరు మేయర్ అభ్యర్థిని వైసీపీ ప్రకటించడం వారి అవగాహనారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. సుప్రీంకోర్టు నుంచి శుక్రవారం కీలక నిర్ణయం వెలువడవచ్చని ఆశిస్తున్నామని, తీర్పు రాగానే అక్టోబర్‌లోనే ఎన్నికలు జరిగే అవకాశం ఉందని లోకేశ్ అభిప్రాయపడ్డారు. స్థానిక ఎన్నికలు ముగిసిన తర్వాతే కార్పొరేషన్ చైర్మన్ల వంటి నామినేటెడ్ పదవుల భర్తీపై దృష్టి సారిస్తామని స్పష్టం చేశారు. ఈ ఎన్నికలకు రిజర్వేషన్ల రొటేషన్ తప్పనిసరిగా చేయాల్సి ఉందని కూడా ఆయన పేర్కొన్నారు.

# కూటమి ప్రభుత్వం

**తాడేపల్లి, మహా :** కూటమి ప్రభుత్వం యువత భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని, రాష్ట్రంలో మాదకద్రవ్యాలను నియంత్రించడంలో పూర్తిగా విఫలమైందని వైసీపీ అధికార ప్రతినిధి శ్యామల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల సమయంలో గంజాయిని సమూలంగా నిర్మూలిస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేశ్ ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని శ్యామల అన్నారు. "హోంమంత్రి వంగలపూడి అనితకు టీవీ షోల టీఆర్పీలపై ఉన్న శ్రద్ధ గంజాయి కేసులను అరికట్టడంపై లేదు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో గంజాయి లేకుండా చేస్తానన్న ఆమె సవాల్ ఏమైంది?" అని ఎద్దేవా చేశారు. కూటమి నేతలు ఆడుతున్నది యువత భవిష్యత్తును నాశనం చేసే 'టాక్సిక్ గేమ్' అని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలో గంజాయి, లిక్విడ్ గంజాయి, ఎండీఎంఏ వంటి మాదకద్రవ్యాల విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయని శ్యామల అన్నారు. ఇటీవల అనకాపల్లిలో రూ.3 కోట్ల విలువైన గంజాయి, అల్లూరి జిల్లాలో రూ.1.34 కోట్ల విలువైన లిక్విడ్ గంజాయి పట్టుబడటమే ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రకాశం జిల్లాలో పోలీసుల కారులోనే గంజాయి దొరకడం సిగ్గుచేటని విమర్శించారు.'ఈగల్' వెబ్‌సైట్ లెక్కల ప్రకారం రాష్ట్రంలో వేల కేసులు నమోదు చేసి, 6 లక్షల కిలోలకు పైగా గంజాయిని పట్టుకున్నారని... అలాంటప్పుడు గంజాయే లేదని ఎలా ప్రచారం చేస్తున్నారని ప్రభుత్వాన్ని ఆమె నిలదీశారు. ఆపరేషన్ చైతన్య, గరుడ వంటి కార్యక్రమాలు విఫలమయ్యాయని, ప్రభుత్వం మాటలు చెప్పడం మాని చేతల్లో చూపించాలని హితవు పలికారు.

# రోబోటిక్ సర్జరీ పేరిట హైదరాబాద్‌లో ఘరానా మోసం

**హైదరాబాద్, మహా :** రోబోటిక్ సర్జరీ సాంకేతికత పేరుతో లక్డీకపూల్ లోని ఫోర్టిస్ ఆసుపత్రి రోగులను, ప్రజలను మోసం చేస్తోందని దళిత విద్యార్థి సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు వంశీ బాలెంల ఆరోపించారు. ఆసుపత్రి యాజమాన్యం, సంబంధిత వైద్యుడు డాక్టర్ రాకేష్ కొమురవెల్లి సోషల్ మీడియా వేదికగా ఫోర్టిస్‌లో రోబోటిక్ సర్జరీ సదుపాయం ఉన్నట్లుగా ప్రచారం చేస్తున్నారని ఆయన విమర్శించారు.సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వంశీ బాలెంల మాట్లాడుతూ.. దుగ్గి వెంకటలక్ష్మి అనే బాధితురాలు ఆన్‌లైన్‌లో వచ్చిన ప్రకటనలను చూసి రోబోటిక్ ఆపరేషన్ కోసం ఫోర్టిస్ ఆసుపత్రిని సంప్రదించారని తెలిపారు. మొదట రోబోటిక్ ఆపరేషన్ చేస్తామని చెప్పి, అనంతరం కేవలం మందులు ఇచ్చి పంపించారని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంపై అనుమానం రావడంతో దళిత విద్యార్థి సమైక్య ప్రతినిధులు ఆసుపత్రి యాజమాన్యం, సూపరింటెండెంట్‌ను వివరణ కోరగా, లకడీకాపూల్ ఫోర్టిస్ ఆసుపత్రిలో రోబోటిక్ మిషన్ లేదని వారు స్వయంగా చెప్పినట్లు వంశీ బాలెంల పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఆసుపత్రి నుంచి తమకు లభించిన రాతపూర్వక కాపీ కూడా తన వద్ద ఉందని తెలిపారు.తనిఖీల సమయంలో మిషన్ తీసుకొచ్చారుఈ విషయంపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేయగా, అధికారులు ఆసుపత్రిలో తనిఖీలు చేపట్టారని వంశీ బాలెంల తెలిపారు. అయితే తనిఖీల సమయంలో స్మిత్ అండ్ నెఫ్యూ కంపెనీకి చెందిన రోబోటిక్ మిషన్‌ను రాత్రికి రాత్రే ఆసుపత్రికి తీసుకొచ్చి చూపించారని ఆయన ఆరోపించారు. ఆ మిషన్ ఏ ఆసుపత్రికి చెందినదో అధికారులకు కూడా తెలుసని పేర్కొన్నారు.ఈ వ్యవహారంపై అధికారులు సమగ్రంగా విచారణ జరిపి, మిషన్ అసలు ఎక్కడి నుంచి వచ్చింది? అది ఏ ఆసుపత్రికి చెందినది? ఫోర్టిస్‌లో దాని వినియోగానికి అనుమతులు ఉన్నాయా? వంటి అంశాలను స్పష్టంగా వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. గ్లోబల్ హాస్పిటల్‌కు చెందిన మిషన్‌ను ఫోర్టిస్‌కు తీసుకురావచ్చా?మరో ముఖ్యమైన అంశంగా వంశీ బాలెంల మాట్లాడుతూ.. ఎల్బీనగర్‌లోని గ్లోబల్ హాస్పిటల్ పరిధిలో స్ట్రైకర్ కంపెనీకి చెందిన రోబోటిక్ మిషన్ ఉందని పేర్కొన్నారు. ఆ మిషన్‌ను మరో ఆసుపత్రికి తరలించడం, తిరిగి ఇన్‌స్టాల్ చేయడం వంటి చర్యలకు సంబంధిత కంపెనీ అనుమతి, ప్రమేయం అవసరమని ఆయన ఆరోపించారు. అటువంటి నిబంధనలు ఉన్నప్పుడు ఎల్బీనగర్‌లోని గ్లోబల్ హాస్పిటల్‌కు సంబంధించిన రోబోటిక్ మిషన్‌ను లకడీకాపూల్‌లోని ఫోర్టిస్ ఆసుపత్రికి తీసుకువచ్చి ఉపయోగించగలరా అనే అంశంపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరారు. "రోబోటిక్ మిషన్ గ్లోబల్ హాస్పిటల్‌లో ఉంటే, రోబోటిక్ సర్జరీ ప్రచారం కూడా గ్లోబల్ హాస్పిటల్ పేరుతోనే చేయాలి. లకడీకాపూల్ ఫోర్టిస్ ఆసుపత్రిలో రోబోటిక్ సర్జరీ సదుపాయం ఉన్నట్లు ఎందుకు ప్రచారం చేస్తున్నారు?" అని వంశీ బాలెంల ప్రశ్నించారు. అలాగే ఎల్బీనగర్ పరిధిలో రోబోటిక్ మిషన్ ఉందని ఆసుపత్రి యాజమాన్యం స్వయంగా అంగీకరించినట్లు తమ వద్ద కాపీ ఉందని, లకడీకాపూల్ ఫోర్టిస్ ఆసుపత్రిలో రోబోటిక్ మెషిన్ లేదనే విషయంపై కూడా సంబంధిత పత్రాలు తమ వద్ద ఉన్నాయని ఆయన తెలిపారు."నాలుగు నెలలు ఉచిత రోబోటిక్ సర్జరీ" ప్రచారంపై అభ్యంతరం రోబోటిక్ పరికరం అందుబాటులో లేకుండానే "నాలుగు నెలలు ఉచిత రోబోటిక్ సర్జరీ" అంటూ సోషల్ మీడియాలో ప్రచారం చేయడం ద్వారా ప్రజలను ఆకర్షించేందుకు ప్రయత్నించారని వంశీ బాలెంల ఆరోపించారు. ఇలాంటి ప్రచారాలు వైద్య నైతిక ప్రమాణాలకు, నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా అనే అంశాన్ని అధికారులు పరిశీలించాలని కోరారు. ఆసుపత్రిలో వాస్తవంగా ఏ రోబోటిక్ సర్జరీ పరికరం ఉంది? దాని యాజమాన్యం ఎవరిది? దాని ఇన్‌స్టాలేషన్, వినియోగానికి అవసరమైన అనుమతులు ఉన్నాయా? ప్రచారంలో పేర్కొన్న రోబోటిక్ సర్జరీలు వాస్తవంగా ఎక్కడ నిర్వహిస్తున్నారు? వంటి అంశాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేయాలని డిమాండ్ ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే ఫోర్టిస్ ఆసుపత్రిపై కఠిన చర్యలు తీసుకోవాలని, సంబంధిత వైద్యుడిపై కూడా చట్టపరమైన చర్యలు చేపట్టాలని తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌ను వంశీ బాలెంల డిమాండ్ చేశారు. ఈ అంశంపై స్పందించి తనిఖీలు చేపట్టిన హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు, తెలంగాణ ప్రభుత్వానికి దళిత విద్యార్థి సమైక్య తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రి యాజమాన్యం నుంచి ఎలాంటి ఒత్తిళ్లు, ప్రలోభాలు వచ్చినా వెనక్కి తగ్గకుండా అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని, బాధితులకు న్యాయం చేయాలని వంశీ బాలెంల కోరారు.

ANN తెలుగు

మహా పత్రిక

శుక్రవారం, హైదరాబాద్
09-10-2026

మహా ప్రత్యేకం

04

# సేవ్ డెమోక్రసీ




## దేశవ్యాప్తంగా ఆందోళనలు

### ఢిల్లీలో ఇండియాకూటమి ఎంపీల ప్రార్థనలు
### ప్రజాస్వామ్యాన్ని హత్యచేసేందుకు నలుగురి కుట్ర : రాహుల్ గాంధీ
### హైదరాబాద్ లో పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఛలో లోక్ భవన్
### బెంగళూరులో కాక్రోచ్ జనతాపార్టీ భారీ నిరసన

(మహా నెట్ వర్క్ ) : సేవ్ డెమోక్రసీ ఆందోళనలు దేశవ్యాప్తంగా జరుగుతున్నాయి. కోట్లాది ఓట్లు గల్లంతుచేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న సీఈసీపై ప్రజల్లో తిరుగుబాటు కనిపిస్తోంది. విపక్ష ఎంపీలు మూడోరోజు ఆందోళనకు దిగారు. రెండురోజుల ఉద్రిక్తతలకు పక్కనబెట్టి మూడోరోజు శాంతియుత ఆందోళన చేశారు. ఢిల్లీ రాజ్‌ఘాట్ వేదికగా ఇండీ కూటమి నేతలు నిరసన తెలిపారు. కన్నాట్ ప్లేస్ నుంచి రాజ్‌ఘాట్‌కు ర్యాలీగా వచ్చి రాజ్‌ఘాట్ వద్ద నివాళులర్పించారు. మోదీ, అమిత్ షాకు సద్బుద్ధి కలగాలని రాజ్‌ఘాట్ వద్ద నేతలు ప్రార్థనలు చేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే, విపక్ష నేత రాహుల్ గాంధీ సహా కూటమి ఎంపీలు ఆందోళనలో పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కూడా ఇందులో పాల్గొన్నారు. గాంధీ తీసుకువచ్చిన స్వాతంత్ర్యాన్ని హరిస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. స్వాతంత్ర్యంతో పాటు ఓటుహక్కును కాలరాస్తున్నారని విమర్శించారు. రాజ్‌ఘాట్ వద్ద ప్రార్థన చేయడానికి వెళ్తున్నామని, స్వాతంత్ర్యం హరించే వారికి సద్బుద్ధి ప్రసాదించాలని ప్రార్థిస్తామని తెలిపారు.

### నేడు రాష్ట్రపతితో భేటీ

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో ఇండియా కూటమి నేతలు భేటీ కానున్నట్టు తెలుస్తోంది. ఎన్నికల సంఘంపై ఫిర్యాదు చేసేందుకు 15 మంది ఎంపీలతో భేటీ కోరగా.. 10 మంది సభ్యుల ప్రతినిధి బృందానికి రాష్ట్రపతి భవన్ అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ, ఖర్గే, అఖిలేశ్ యాదవ్, తేజస్వీ యాదవ్, మమతా బెనర్జీ వంటి ప్రముఖ నేతలు ఈ బృందంలో పాల్గొనే అవకాశాలున్నాయి. ఇదిలా ఉండగా.. ఇండియా కూటమి నిరసనల నేపథ్యంలో ఢిల్లీలో భద్రతను కట్టుదిట్టం చేశారు పోలీసులు. జ్ఞానేశ్ కుమార్ నివాసం, ఎన్నికల సంఘం కార్యాలయం వద్ద అదనపు బలగాలను మోహరించారు.




### పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండి కూటమి నేతలు చేపట్టి చలో లోక్ భవన్ కార్యక్రమం ఉద్రిక్తతగా మారింది. లోక్ భవన్ ముట్టడికి ప్రయత్నించిన కూటమి నేతలను పోలీసులు అడ్డుకున్నారు. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కొనసాగిన కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం, తెలంగాణ జనసమితి, కాంగ్రెస్ పార్టీ నేతలు లోక్ భవన్ ముట్టడికి ప్రయత్నించారు.



### ప్రజాస్వామ్య హత్యకు నలుగురి కుట్ర : రాహుల్ గాంధీ

300 మంది ఎంపీలం ప్రశాంతంగా ఆందోళన చేయాలనుకుంటున్నామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ తెలిపారు. నిన్న జంతర్‌మంతర్ వెళ్లాలని ప్రయత్నించామని అన్నారు. మోదీ, అమిత్‌షా, మోహన్ భగవత్, జ్ఞానేశ్ కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని హత్య చేసేందుకు నలుగురు కుట్ర పన్నుతున్నారని విమర్శించారు.








### బెంగళూరులో ధ్రువ్ రాఠీ, ప్రకాష్ రాజ్, అభిజీత్ దిప్కే

బెంగళూరు లోని ఫ్రీడమ్ పార్క్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర పరిశీలన విధానానికి వ్యతిరేకంగా భారీ నిరసన కార్యక్రమం జరిగింది. సీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యూట్యూబర్ ధ్రువ్ రాఠీ, నటుడు ప్రకాష్ రాజ్, సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కేలతో పాటు పలువురు ప్రముఖులు ఒకే వేదికను పంచుకున్నారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన పీపుల్స్ ట్రిబ్యునల్‌లో పాల్గొన్న ప్రసంగీకులు ఎన్నికల సంఘం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే తన ప్రసంగాన్ని ప్రారంభిస్తూ, వేదిక ముందున్న నిరసనకారులతో 'నరేంద్ర మోదీ వోట్ చోర్' అంటూ నినాదాలు చేయించారు. దేశంలో ఓటర్ల తొలగింపు ప్రక్రియ ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తోందని ఆయన విమర్శించారు. ఈ నిరసన వేదికపై ధ్రువ్ రాఠీ, విలేకరి జుబేర్, అభిజీత్ దిప్కేలు కలిసి కనిపించడం విశేషం. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల ప్రతినిధులు, వివిధ ప్రజా సంఘాల సభ్యులు, వామపక్ష యువజన విభాగాలు పాల్గొన్నాయి.







# పూల సింగిడి.. పాటల సందడి..!

- ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ..
- సంస్కృతి పరిరక్షణలో యువత భాగస్వాములు కావాలి..
- పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు..
- మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా సంబరాలు..

**మణుగూరు, మహా** : తంగేడు పూల పసిడి వన్నెలు.. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు.. చుట్టూ చేరి ఆడిపాడిన విద్యార్థినులు..! మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణం గురువారం బతుకమ్మ సంబరాలతో కళకళలాడింది. కళాశాల మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని సందడి చేశారు. బతుకమ్మ పాటలు, జానపద నృత్యాలతో తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ యర్నం చిన్నప్పయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమాన్ని పినపాక ఎమ్మెల్యే, శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. విద్యార్థినులతో కలిసి బతుకమ్మ పాటలు పాడుతూ, పాటలకు లయబద్ధంగా స్టెప్పులు వేస్తూ.. వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సంస్కృతి సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీక అని అన్నారు. ప్రకృతితో మమేకమై పూలను పూజిస్తూ, అందరూ కలిసి ఆనందాన్ని పంచుకునే విశిష్ట పండుగగా పేర్కొన్నారు. విద్యార్థులు ఆధునిక విద్యతోపాటు తమ ప్రాంతీయ సంస్కృతి, కళలు, ఆచార వ్యవహారాలను తెలుసుకోవాలని పాయం సూచించారు. వాటిని భావితరాలకు అందించడంలో యువత భాగస్వాములు కావాలన్నారు. మహిళలు విద్య, ఉపాధి, సామాజిక రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక, సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి వేడుకలు విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, సంస్కృతి పట్ల గౌరవాన్ని పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులను అభినందించారు. సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు దోహదపడతాయని సమితి సింగారం సర్పంచ్ కలబోయిన మాధవరావు అన్నారు. మన సంప్రదాయాలను భావితరాలకు అందించాలని ఉపసర్పంచ్ గాండ్ల సురేష్ సూచించారు. మహిళల సాంస్కృతిక వైభవానికి బతుకమ్మ నిదర్శనమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సత్య ప్రకాశ్, ఇటువంటి వేడుకలు సామాజిక ఐక్యతను బలపరుస్తాయని జూనియర్ లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కుర్షీద్ పేర్కొన్నారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి పూలతో విద్యార్థినులు పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వాటి చుట్టూ లయబద్ధంగా చప్పట్లు కొడుతూ విద్యార్థినులు ఆడిపాడారు. కార్యక్రమంలో మహిళా సాధికారత విభాగం సమన్వయకర్త ఆర్.వీణ, జిల్లా నాయకుడు దొబ్బల వెంకటప్పయ్య, నాయకుడు ఎస్.గణేష్‌రెడ్డి, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




# పారదర్శకంగా భూ సర్వే నిర్వహిస్తాం

- ఎమ్మార్వో అమరలింగం గౌడ్A

రాజేంద్రనగర్ మహా ; తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన భూ భారతి భూ సర్వేలో భాగంగా శంషాబాద్ మండలం కేబీ దొడ్డి గ్రామంలో సర్పంచ్ ఎల్గని ప్రభాకర్ గౌడ్ ఆధ్వర్యంలో గురువారం గ్రామ సభ నిర్వహించి, భూ సర్వేకు సంబంధించిన పలు అంశాలపై రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు, రైతులకు అవగాహన కల్పించారు.ఎమ్మార్వో అమర లింగం గౌడ్ మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పూర్తి స్థాయిలో పారదర్శకంగా భూ సర్వే నిర్వహించి, గ్రామస్తులు రైతులకు అండగా ఉంటామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా సర్వే అధికారులు, మండల అధికారులు, మాజీ సర్పంచ్ దండు ఇస్తారి,ఉప సర్పంచ్ దండు శివ కుమార్, స్థానిక వార్డ్ సభ్యులు సుమిత్ర మల్లికార్జున్ , రాజు గౌడ్, బల్వంత్ రెడ్డి, జగన్, నర్సింగ్ ముదిరాజ్, స్వప్న సిద్దయ్య , సుమిత్ర మల్లికార్జున్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు, రైతులు ఆగి రెడ్డి ,నసీర్ ,దుర్గారెడ్డి ,గోపాల్ ,శివ గౌడ్ ,గ్రామ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# రాహుల్, ప్రియాంకల నిర్బంధంపై కాంగ్రెస్ ఆగ్రహం..

- మణుగూరులో ధర్నా, రాస్తారోకో..
- నిరసనలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**మణుగూరు, మహా** : ఢిల్లీలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో పాటు తదితర ప్రతిపక్ష ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని పేర్కొంటూ కాంగ్రెస్ శ్రేణులు గురువారం మణుగూరులో ఆందోళన చేపట్టాయి. అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా, రాస్తారోకో నిర్వహించాయి. పినపాక ఎమ్మెల్యే, శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు పాల్గొని నాయకులు, కార్యకర్తలతో కలిసి నిరసన తెలిపారు. రోడ్డుపై బైఠాయించిన కాంగ్రెస్ శ్రేణులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశాయి. తౌలుత పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన వ్యక్తం చేస్తున్న ప్రతిపక్ష నాయకులను నిర్బంధించడం తగదన్నారు. ఓటర్ల జాబితా సవరణపై ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు పూర్తి విశ్వాసం కలిగేలా పారదర్శకత పాటించాలని కోరారు. ప్రజల ఓటు హక్కు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఓటర్ల జాబితా సవరణ అంశంపై నిరసన తెలుపుతూ, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేసిన రాహుల్, ప్రియాంకతోపాటు ప్రతిపక్ష ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ప్రజల సందేహాలను నివృత్తి చేయాల్సిన సమయంలో నిరసనకారులను నిర్బంధించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పీరినాకి నవీన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కురం రవి ముదిరాజ్, పార్టీ జిల్లా, మండల, పట్టణ నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, ఐఎన్‌టీయూసీ నాయకులు, లారీ యూనియన్ ప్రతినిధులు, బొగ్గు ముఠా కార్మికులు, గుమాస్తాల సంఘం నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# భూ రీ - సర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్
- నల్లబండ బోడు భూ రీ - సర్వే ను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్



**జూలూరుపాడు, మహా** : మండల పరిధి నల్లబండ బోడు గ్రామపంచాయతీ రెవిన్యూ పరిధిలో జరుగుతున్న భూ రీసర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా భూ రీసర్వే పురోగతి, ఇప్పటివరకు చేపట్టిన సర్వే వివరాలు, గ్రామ సరిహద్దుల నిర్ధారణ తదితర అంశాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నల్లబండ బోడు పరిధిలో మొత్తం 1,426 ఎకరాల భూమి ఉండగా, సుమారు 12.50 కిలోమీటర్ల మేర భూ రీసర్వే ప్రక్రియ చేపడుతున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. గ్రామ సరిహద్దులను నిర్ణయిస్తూ సర్వే ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలిపారు. భూ రీసర్వేను పకడ్బందీగా నిర్వహించి, భూముల వివరాలు కచ్చితంగా నమోదు చేయడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భూ రీసర్వే సందర్భంగా ప్రతి భూమికి సంబంధించిన వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రికార్డులతో సరిపోల్చి నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అవసరమైన సాంకేతిక పద్ధతులను వినియోగించాలని అధికారులను ఆదేశించారు. భూ సరిహద్దుల విషయంలో రైతులకు ఉన్న సందేహాలను క్షేత్రస్థాయిలోనే నివృత్తి చేయాలని సూచించారు. రీ సర్వే పూర్తయిన అనంతరం భూములకు సంబంధించిన రికార్డులు మరింత స్పష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులకు భూ యాజమాన్యానికి సంబంధించిన సమస్యలు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని రెవెన్యూ, సర్వే అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలోని రైతులతో కలెక్టర్ మాట్లాడి భూ రీసర్వే వల్ల కలిగే ప్రయోజనాలు, వారి భూముల వివరాలు, సాగు చేస్తున్న పంటలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట జూలూరుపాడు తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రవి, గ్రామ సర్పంచ్ జి సింధు, సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మాయిల్ సాగుతో రైతులకు స్థిరమైన ఆదాయం

**దమ్మపేట ,మహా :** రాష్ట్రంలో పామాయిల్ సాగు చేపట్టిన రైతులందరూ ఆర్థికంగా స్థిరంగా ఉన్నారని , ఈ ప్రాంత రైతులకు స్థిరమైన ఆర్థిక వనరుగా పామాయిల్ సాగు మేలు చేస్తుందని దమ్మపేట మండలం అల్లిపల్లికి చెందిన రాష్ట్ర పామాయిల్ సంఘం అధ్యక్షుడు ఆలపాటి రామ చంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం ఆయన వరంగల్ పామాయిల్ సంఘం రైతులతో సమావేశమై రైతులకు పలు సూచనలు చేశారు. పామాయిల్ సాగు ద్వారా రైతులు ఆర్థికంగా బలపడే అవకాశం ఉందని ఆలపాటి పేర్కొన్నారు. వరంగల్ జిల్లాలో నిర్వహించిన పామాయిల్ సాగు సదస్సులో ఆయన పాల్గొని రైతులకు పామాయిల్ సాగు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

పామాయిల్ సాగుకు అనుకూలమైన పరిస్థితులను సద్వినియోగం చేసుకుని రైతులు సాగు చేపడితే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. పామాయిల్ తోటల ద్వారా దీర్ఘకాలికంగా ఆదాయం పొందడంతో పాటు రైతుల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడే అవకాశం ఉందన్నారు. రైతులు పామాయిల్ సాగుపై అవగాహన పెంచుకుని, శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేస్తే మెరుగైన దిగుబడులు, ఆదాయం సాధించవచ్చని సూచించారు. ఇందుకోసం ప్రభుత్వం ద్వారా సబ్సిడీ పై పామాయిల్ మొక్కలను అందుబాటులో ఉంచారని ,రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సదస్సులో పామాయిల్ సాగుకు సంబంధించిన పలు అంశాలపై రైతులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పామాయిల్ రైతులు , మాజీ ఆత్మాకమిటీ చైర్మన్ కేదాసి వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిపై దుష్ప్రచారం తగదు

- ఆడపిల్లల గౌరవానికి భంగం కలిగేలా వ్యవహరించవద్దు
- సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వారిని ఉపేక్షించొద్దు
- కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి



**మంచాల అక్టోబర్ 8 మహా**: ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డిపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వారిని, ఏమాత్రం ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకొని శిక్షించాలని, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. కలెక్టరేట్ వద్ద సమావేశం ముగించుకొని బయలుదేరుతున్న సమయంలో, తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉచిత బస్సు పథకం గురించి మహిళల స్పందనను తెలుసుకోవడానికి ఆయన బస్సు ఎక్కారని, తన కూతురు లాంటి అమ్మాయితో చేయి పట్టుకొని ఆప్యాయతతో మాట్లాడితే సంస్కారం లేని నాయకులు, ఎమ్మెల్యే పైన సోషల్ మీడియాలో విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దమ్ముంటే అభివృద్ధిపై ప్రశ్నించాలని రాజకీయ విమర్శ చేస్తే హుందాగా ఉండాలని, ఇట్లా ఆడపిల్లల గౌరవాలకు భంగం కలిగించేలా ఉండొద్దని హితవు పలికారు. ప్రతీ మహిళను తన తల్లిలా చెల్లిలా పలకరించే రంగారెడ్డి తన రాజకీయ జీవితంలో మహిళలకు అత్యంత ప్రధాన్యత ఇచ్చి గౌరవిస్తారని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతుంటే తట్టుకోలేని బిఆర్ఎస్ నాయకులు కుళ్ళుతో విమర్శించడానికి ఎలాంటి అవకాశాలు లేకపోవడంతో ఇలాంటి దుష్ప్రచారాలు చేస్తున్నారని, ఇలాంటి వారిని క్షమించి వదిలేస్తే సమాజానికి మంచిదికాదని, మరోసారి ఆడపిల్లల గౌరవానికి భంగం కలిగేలా సోషల్ మీడియాలో వక్రీకరణలు చేయకుండా కఠినంగా శిక్షించాలని అన్నారు.




# ప్రభుత్వ బడుల్లో ఆంగ్లంపై ఆసక్తి పెంపు

- పుస్తకాల అభ్యాసంతో మాట్లాడే ధైర్యం: మట్టా దయానంద్

**సత్తుపల్లి, మహా** : ఆంగ్ల సంభాషణ పుస్తకాల అభ్యాసంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో ఆంగ్లంపై అవగాహన, మాట్లాడాలనే ఆసక్తి పెరుగుతుందని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ అన్నారు. పుస్తకాల్లోని అంశాలను రోజువారీ సంభాషణల్లో ఆచరించడం ద్వారా విద్యార్థుల్లో మాట్లాడే ధైర్యం పెరుగుతుందని పేర్కొన్నారు. సత్తుపల్లి తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో దయానంద్ విజయ్‌కుమార్ సమక్షంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ పుస్తకాలను ఆవిష్కరించారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇవి అందుబాటులోకి రానున్నాయని మట్టా దయానంద్ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి అజయ్ యాదవ్, తహసీల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్‌బాబు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నకేశవరావు, అధికారులు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, ప్రైవేటు విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ బడుల్లో ఆంగ్లంపై ఆసక్తి పెంపు

- పుస్తకాల అభ్యాసంతో మాట్లాడే ధైర్యం: మట్టా దయానంద్

**సత్తుపల్లి, అక్టోబరు 8**: మహా : ఆంగ్ల సంభాషణ పుస్తకాల అభ్యాసంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో ఆంగ్లంపై అవగాహన, మాట్లాడాలనే ఆసక్తి పెరుగుతుందని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ అన్నారు. పుస్తకాల్లోని అంశాలను రోజువారీ సంభాషణల్లో ఆచరించడం ద్వారా విద్యార్థుల్లో మాట్లాడే ధైర్యం పెరుగుతుందని పేర్కొన్నారు. సత్తుపల్లి తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో దయానంద్ విజయ్‌కుమార్ సమక్షంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ పుస్తకాలను ఆవిష్కరించారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇవి అందుబాటులోకి రానున్నాయని మట్టా దయానంద్ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి అజయ్ యాదవ్, తహసీల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్‌బాబు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నకేశవరావు, అధికారులు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, ప్రైవేటు విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.




# మహిళలకు సురక్షితమైన పని ప్రదేశాలను కల్పించడమే లక్ష్యం

**సీపీ అంబర్ కిషోర్ ఝా**

**పెద్దపల్లి మహా :** మహిళలకు సురక్షితమైన పని ప్రదేశాలను కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. పోష్ చట్టం-2013 అమలులో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. పెద్దపల్లి మహా: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కార్యాలయాల్లో మహిళల ఫిర్యాదుల పరిష్కార కమిటీ పనితీరు, విధులు, బాధ్యతలు, ఫిర్యాదుల పరిష్కార విధానాలపై గురువారం కమిషనరేట్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ మహిళలు ఎలాంటి భయం, ఒత్తిడి లేకుండా తమ సమస్యలను కమిటీ దృష్టికి తీసుకువచ్చేలా విశ్వసనీయ వాతావరణం కల్పించాలని సూచించారు. ఫిర్యాదులను స్వీకరించడం, నమోదు చేయడం, నిబంధనల ప్రకారం విచారణ చేపట్టడం, నిర్ణీత గడువులో నివేదిక సమర్పించడం వంటి ప్రక్రియలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ఫిర్యాదుదారు, ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి, సాక్షుల వివరాల గోప్యతను తప్పనిసరిగా కాపాడాలని, విచారణలో పారదర్శకతతో పాటు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. కార్యాలయాల్లో కమిటీ వివరాలు, ఫిర్యాదు చేసే విధానాన్ని నోటీసు బోర్డులపై స్పష్టంగా ప్రదర్శించాలని తెలిపారు. పోలీసు సిబ్బంది, ఉద్యోగులకు లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. మహిళల గౌరవం, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ వేధింపులకు తావులేని పని వాతావరణం కల్పించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సీపీ సూచించారు. సమావేశంలో అదనపు పోలీసు అధికారులు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, షీ టీమ్, భరోసా, సఖి కేంద్రాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి: డీఆర్వో పద్మావతి

**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి సూచించారు. రోడ్డు భద్రత ప్రమాదాల నివారణ హిట్ అండ్ రన్ కేసుల పరిష్కారం ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 2026 జనవరి 1 నుంచి సెప్టెంబర్ 15 వరకు మొత్తం 370 రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయని వీటిలో 164 ప్రమాదాలు ప్రాణాంతకమైనవిగా ఉన్నాయని తెలిపారు. ఈ ప్రమాదాల్లో 176 మంది మృతి చెందగా 23 మంది తీవ్రంగా 344 మంది స్వల్పంగా గాయపడినట్లు వివరించారు. నమోదైన 370 ప్రమాదాల్లో 369 కేసుల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి 99.4 శాతం కేసుల్లో చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రహదారుల వారీగా ప్రమాదాల వివరాలను పరిశీలిస్తూ రాష్ట్ర రహదారులపై 79, ప్రధాన జిల్లా రహదారులపై 4, ఇతర జిల్లా రహదారులపై 32, జాతీయ రహదారులపై 67 ప్రమాదాలు జరిగినట్లు అధికారులు వివరించారు. ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి వాటికి గల కారణాలను విశ్లేషించి సంబంధిత రహదారి సంస్థల ద్వారా అవసరమైన భద్రతా చర్యలను వెంటనే చేపట్టాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలను ప్రాధాన్యతతో చేపట్టాలని ప్రమాదాలకు కారణమవుతున్న మలుపులు బ్లాక్‌స్పాట్లు రహదారి లోపాలను గుర్తించి సకాలంలో సరిచేయాలని అన్నారు. అవసరమైన ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, రోడ్ మార్కింగ్‌లు, వీధి దీపాలు ఏర్పాటు చేసి వాటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. హిట్ అండ్ రన్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న 7 కేసులను సీసీ కెమెరాలు సాంకేతిక ఆధారాలు ఇతర సమాచారాన్ని వినియోగించి త్వరితగతిన ఛేదించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి ప్రాణాంతక ప్రమాదానికి సంబంధించి కారణాలను విశ్లేషించి సంబంధిత రహదారి సంస్థలు రవాణా శాఖకు అవసరమైన సమాచారం అందించి పునరావృత ప్రమాదాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ రవాణా ఆర్అండ్‌బీ పంచాయతీరాజ్ జాతీయ రహదారుల శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రమాదాల నివారణకు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని డీఆర్వో పద్మావతి ఆదేశించారు. రహదారి భద్రతా ప్రమాణాలను పాటించేలా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రమాదాలపై విశ్లేషణ ఆధారంగా అవసరమైన శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమీక్షలో జిల్లా రవాణా అధికారి భూషిత్ రెడ్డి, డీఆర్ఎం జి.బాలాజీ, డీహెచ్ఎంఓ తుకారాం రాథోడ్, ఆర్అండ్‌బీ ఈఈ, ట్రాఫిక్ ఎస్ఐ, సీ సెక్షన్ సిబ్బంది సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## సీతారామ.. సత్తుపల్లి ట్రంక్‌కు వేగం

- **భూసేకరణ త్వరగా పూర్తి చేయాలి.. రైతులకు పరిహారం చెల్లించాలి**
- **నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో మంత్రి తుమ్మల భేటీ**

**సత్తుపల్లి, మహా** : సీతారామ ఎత్తిపోతల పథకం, సత్తుపల్లి ట్రంక్ పనులను వేగవంతం చేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగు, తాగునీటి అవసరాలను తీర్చేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు గురువారం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో భేటీ అయిన ఆయన ప్రాజెక్టుల పురోగతి, పెండింగ్ పనులు, భూసేకరణ, పైప్‌లైన్ నిర్మాణం తదితర అంశాలపై చర్చించారు. భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి, భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

**సత్తుపల్లి ట్రంక్‌పై ప్రత్యేక దృష్టి**

సత్తుపల్లి ట్రంక్ పనుల్లో పెండింగ్‌లో ఉన్న భూసేకరణను వేగవంతం చేయాల్సిన అవసరాన్ని తుమ్మల ప్రస్తావించారు. భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం చెల్లింపులు త్వరగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పనులు పూర్తయితే సత్తుపల్లి, వేంసూరు మండలాల్లో సాగు, తాగునీటి అవసరాలకు మరింత భరోసా కలుగుతుందని వివరించారు.

**ఆయకట్టుకు సాగునీటి భరోసా**

వర్షాభావ పరిస్థితుల్లో ఆయకట్టు రైతులకు సాగునీటి భరోసా కల్పించడంలో సీతారామ ప్రాజెక్టు కీలకమని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటికే సాగర్ ఆయకట్టు పరిధిలోని వైరా, లంకసాగర్ ప్రాంతాలకు సీతారామ ప్రాజెక్టు ద్వారా నీటిని విడుదల చేసిన విషయాన్ని ప్రస్తావించారు. మిగిలిన పనులను పూర్తి చేసి సాగునీటి వనరులను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.

**మంత్రి ఉత్తమ్ సానుకూల స్పందన**

మంత్రి తుమ్మల విజ్ఞప్తిపై ఉత్తమ్ కుమార్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పైప్‌లైన్, సొరంగం తదితర పనుల పురోగతిపై ఇరువురు మంత్రులు చర్చించారు. రైతులకు వీలైనంత త్వరగా సాగునీరు అందేలా పెండింగ్ పనులను వేగవంతం చేయడంతో పాటు భూసేకరణ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

**పలు మండలాలకు ప్రయోజనం**

సీతారామ ఎత్తిపోతల పథకం, సత్తుపల్లి ట్రంక్ పనులు పూర్తయితే ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు మండలాల్లో సాగునీటి వసతులు మెరుగుపడటంతో పాటు తాగునీటి అవసరాలకు కూడా భరోసా లభించనుంది. దీంతో భూసేకరణ పూర్తి చేసి రైతులకు పరిహారం చెల్లించడం, పెండింగ్ నిర్మాణ పనులను వేగవంతం చేయడం కీలకంగా మారింది.

## ఇసుక దుమారం..రాజకీయ వేడి..!

- **గుట్టమల్లారంలో లారీల అడ్డగింత..**
- **మొదలైన వివాదం..**
- **అటవీ మార్గం అనుమతులు.. వసూళ్ల లెక్కలపై రేగా ప్రశ్నలు..**
- **తమ ఉపాధిని అడ్డుకుంటున్నారని సొసైటీ మహిళల ఎదురుదాడి..**
- **ఈ నెల 10న ఛలో మణుగూరుకు రేగా పిలుపు..**



**మణుగూరు, మహా** : ఇసుక లారీల రాకపోకలు.. రహదారులపై దుమ్ము ధూళి.. అటవీ మార్గానికి అనుమతులు.. వసూళ్ల లెక్కలు..! మణుగూరులో ఇసుక రవాణా చుట్టూ వివాదం రాజుకుంటోంది. గుట్టమల్లారంలో ఇసుక లారీలు వెళ్లే అటవీ మార్గాన్ని బీఆర్ఎస్ నాయకులు అడ్డుకోవడం, అందుకు ప్రతిగా ఇసుక సొసైటీల మహిళలు ఆందోళనకు దిగడంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్ రేగా కాంతారావు ఈ నెల 10న ఛలో మణుగూరు, పట్టణ బంద్‌కు పిలుపునివ్వడంతో వివాదం మరింత ముదిరే సూచనలు కనిపిస్తున్నాయి. దుమ్ము నియంత్రణతో మొదలైన ఆందోళన ఇప్పుడు అటవీ అనుమతులు, ఇసుక రవాణా నిర్వహణ, నిధుల వినియోగంపై ప్రశ్నలకు దారితీసింది.

**- దుమ్ము నియంత్రించాలని అడ్డగింత**

గుట్టమల్లారంలో ఇసుక లారీలు వెళ్లే అటవీ మార్గం వద్ద రేగా కాంతారావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేపట్టారు. లారీల రాకపోకలతో దుమ్ము లేచి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, రహదారులపై క్రమం తప్పకుండా నీళ్లు చల్లాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా అధికారులు ఇసుక గుత్తేదారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని రేగా ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే అధికారులు, గుత్తేదారులు భవిష్యత్తులో చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

**- అనుమతులేమిటి.. లెక్కలెక్కడ..?**

రిజర్వు అటవీ ప్రాంతంలోని మార్గంలో ఇసుక లారీల రవాణాకు ఎటువంటి అనుమతులు ఉన్నాయో అటవీ శాఖ అధికారులు వెల్లడించాలని రేగా డిమాండ్ చేశారు. ఈ నెల 10న సంబంధిత అనుమతులను చూపించాలని కోరారు. లారీల నుంచి వసూలు చేస్తున్నట్లు పేర్కొన్న డబ్బును ఏ ఖాతాలో జమ చేస్తున్నారో లెక్కలు చెప్పాలన్నారు. దీంతో మార్గం వినియోగానికి అనుమతులు, వసూళ్ల ప్రాతిపదిక, జమ వివరాలపై స్పష్టత అవసరమైంది. ఈ అంశాలపై సంబంధిత అధికారుల వివరణ తెలియాల్సి ఉంది.

**- సొసైటీ మహిళల ప్రతిఘటన**

లారీల రాకపోకలను అడ్డుకోవడాన్ని నిరసిస్తూ ఇసుక సొసైటీల మహిళలు మణుగూరు అంబేద్కర్ సెంటర్‌లో ఆందోళన నిర్వహించారు. అటవీ మార్గంలో నీళ్లు చల్లుతూ లారీలను నడిపిస్తున్నామని, తమ ఉపాధిని అడ్డుకోవడం సరికాదని వాదించారు. తాము కూడా గిరిజనులమేనని, తోటి గిరిజనులను ఇబ్బంది పెట్టడం తగదన్నారు. అటవీ మార్గానికి అనుమతులు అడుగుతున్న రేగా, రిజర్వు అటవీ ప్రాంతంలో పామాయిల్ తోట ఎలా వేశారని కొందరు మహిళలు ఆరోపించారు. ఆ తోట వద్ద గుడిసెలు వేస్తామంటూ నిరసన వ్యక్తం చేశారు. అయితే తోట ఉన్న భూమి స్వరూపం, యాజమాన్యం, అనుమతులకు సంబంధించిన రికార్డులు వెల్లడికావాల్సి ఉంది. మహిళల ఆరోపణలపై రేగా స్పందన కూడా తెలియాల్సి ఉంది.

**- రహదారులు.. నిధులపైనా విమర్శలు**

ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో రేగా మాట్లాడుతూ ఇసుక, బొగ్గు లారీల రాకపోకలతో ప్రధాన రహదారులతోపాటు కాలనీ రోడ్లు దెబ్బతిన్నాయని ఆరోపించారు. దుమ్ము ధూళితో ప్రజలు శ్వాసకోశ సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులకు భారీగా నిధులు అందుబాటులో ఉండేవని, ప్రస్తుతం రోడ్ల నిర్వహణను కూడా పట్టించుకోవడం లేదని విమర్శించారు. సింగరేణి సీఎస్ఆర్, జిల్లా ఖనిజ ఫౌండేషన్ ట్రస్టు—డీఎంఎఫ్‌టీ నిధులను ప్రజల అవసరాలకు సక్రమంగా వినియోగించాలని డిమాండ్ చేశారు. సింగరేణి యాజమాన్యం ప్రధాన రహదారులను ప్రతిరోజూ శుభ్రం చేయించాలని, పెండింగ్‌లో ఉన్న కాలనీ రోడ్లు, కమలాపురం రహదారి పనులను పూర్తి చేయాలని కోరారు. కాలుష్య సమస్యపై సింగరేణి యాజమాన్యం, ఇసుక కాంట్రాక్టర్లకు వ్యతిరేకంగా జాతీయ హరిత ట్రైబ్యునల్‌ను ఆశ్రయిస్తామని ప్రకటించారు.

**- పదో తేదీపై అందరి దృష్టి**

ఈ నెల 10న నిర్వహించనున్న ఛలో మణుగూరులో ప్రజలు, ప్రజాసంఘాలు, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొనాలని రేగా పిలుపునిచ్చారు. పట్టణ బంద్‌తోపాటు నియోజకవర్గంలోని ఇసుక క్వారీలను నిలిపివేసి, లారీలను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని ప్రకటించారు. గిరిజన సర్పంచ్‌లను ముందుపెట్టి కాంట్రాక్టర్లు తమ ప్రయోజనాలు కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఒకవైపు ప్రజల ఆరోగ్యం, రహదారుల పరిరక్షణ పేరుతో బీఆర్ఎస్ ఆందోళన.. మరోవైపు ఉపాధిని అడ్డుకోవద్దంటూ సొసైటీ మహిళల నిరసనతో వివాదం కొత్త మలుపు తీసుకుంది. రాజకీయ ఆరోపణలకు అతీతంగా అటవీ మార్గం అనుమతులు, వసూళ్ల వివరాలు, దుమ్ము నియంత్రణ చర్యలను సంబంధిత శాఖలు వెల్లడిస్తేనే వాస్తవాలపై స్పష్టత రానుంది. పదో తేదీ ఆందోళనకు ముందుగా అధికారులు ఎలా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

## ఖాబ్రస్తాన్ స్థల సమస్యకు త్వరలో పరిష్కారం

- **సంబంధిత అధికారులతో చర్చించి చర్యలు చేపడతాం: కలెక్టర్ దివాకర్**

సత్తుపల్లి, అక్టోబరు 8: మహా : సత్తుపల్లి పట్టణంలోని వేంసూరు రోడ్డులో నీలాద్రి అర్బన్ పార్క్ సమీపంలోని ఖాబ్రస్తాన్ స్థల సమస్యను త్వరలో పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ దివాకర్ తెలిపారు. ఏళ్లుగా అటవీశాఖ, ముస్లిం సమాజం మధ్య కొనసాగుతున్న వివాదాన్ని పరిష్కరించాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ దివాకర్, దయానంద్ విజయ్‌కుమార్‌తో కలిసి బుధవారం ఖాబ్రస్తాన్ స్థలాన్ని పరిశీలించారు. సమస్యకు సంబంధించిన వివరాలను ముస్లిం పెద్దలు కలెక్టర్‌కు వివరించారు. స్థలానికి సంబంధించిన అంశాలను పరిశీలించిన కలెక్టర్.. సంబంధిత శాఖల అధికారులతో చర్చించి త్వరలోనే పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, తహసీల్దార్, ఎంపీడీవో, అటవీశాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులు, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నకేశవరావు, కాంగ్రెస్ నాయకులు కమల్ పాషా, కాంగ్రెస్ కార్యకర్తలు, ముస్లిం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## పాత రికార్డులు.. క్షేత్రస్థాయి పరిశీలన

- **నారాయణపురం భూ సమస్యలపై కలెక్టర్ దివాకర్ స్పష్టీకరణ**
- **అక్టోబర్ 15 వరకు రైతుల అభ్యంతరాలు, దరఖాస్తుల స్వీకరణ**



**సత్తుపల్లి, అక్టోబరు 8**: మహా : భూ హక్కులకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో పాత రెవెన్యూ రికార్డులు, ప్రస్తుత క్షేత్రస్థాయి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి నిజమైన హక్కుదారులకు న్యాయం చేస్తామని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ తెలిపారు. సత్తుపల్లి మండలం బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని నారాయణపురంలో గురువారం నిర్వహించిన గ్రామసభలో రైతుల భూ సమస్యలు, రీసర్వేపై ఆయన సమీక్షించారు. నారాయణపురంలో భూ రీసర్వే ద్వారా ప్రస్తుతం ఎవరు ఏ భూమిలో సాగులో ఉన్నారు, ఎంత విస్తీర్ణంలో ఉన్నారనే వివరాలను క్షేత్రస్థాయిలో గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. గతంలో భూముల నమోదు, సీలింగ్ భూముల గుర్తింపు, పట్టా భూముల రికార్డుల్లో ఉన్న వ్యత్యాసాలను పాత పహణీలు, రెవెన్యూ రికార్డులు, క్షేత్రస్థాయి పరిస్థితులతో సరిపోల్చి పరిశీలిస్తామన్నారు.

**60 ఏళ్ల రికార్డుల పరిశీలన**

గ్రామానికి సంబంధించిన సుమారు 60 ఏళ్ల నాటి పాత రికార్డులను పరిశీలిస్తున్నామని తెలిపారు. సీలింగ్ భూములు, పట్టాలు, గత భూ బదలాయింపులు, సాదాబైనామాలు తదితర వివరాలను పరిశీలించి హక్కులపై స్పష్టత తీసుకొస్తామన్నారు. భూమి ప్రస్తుతం ఎవరి ఆధీనంలో ఉందనే అంశంతోపాటు అది ఎవరినుంచి, ఎప్పుడు సంక్రమించింది, గతంలో ఎవరి పేరుపై నమోదై ఉందనే వివరాలను కూడా ఆధారాలతో పరిశీలిస్తామని చెప్పారు. బేతుపల్లి భూ రీసర్వేలో భాగంగా వివిధ బృందాలు రూపొందిస్తున్న మ్యాప్‌లను సమన్వయం చేసి నారాయణపురానికి సమగ్ర మ్యాప్ సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సర్వే అనంతరం ప్రతి భూ యజమానికి వారి పేరుపై నమోదైన విస్తీర్ణం, సర్వేలో గుర్తించిన విస్తీర్ణం తదితర వివరాలతో నోటీసులు జారీ చేస్తామన్నారు.

**ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలి**

రికార్డుల సమస్యల కారణంగా భూములు విక్రయించలేకపోతున్నామని పలువురు రైతులు తన దృష్టికి తీసుకొచ్చారని కలెక్టర్ తెలిపారు. ఇలాంటి వారు తమ భూమికి సంబంధించిన పాత పత్రాలు, కొనుగోలు, వారసత్వం, బదలాయింపులకు సంబంధించిన ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అందుబాటులో ఉన్న రికార్డులతో వాటిని సరిపోల్చి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. భూ రీసర్వేకు సంబంధించి అభ్యంతరాలు, సందేహాలు ఉన్న రైతుల నుంచి అక్టోబర్ 15 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని కలెక్టర్ వెల్లడించారు. క్యాంపు సమయంలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలిస్తామని, పరిష్కరించిన అంశాల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. భూ రీసర్వే, రికార్డుల పరిశీలనలో ఎలాంటి పక్షపాతానికి తావులేకుండా పారదర్శకంగా వ్యవహరిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. రికార్డులు, ఆధారాలు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని హక్కుదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, మండల ప్రత్యేక అధికారి ముజాహిద్, సత్తుపల్లి తహసీల్దార్ సత్యనారాయణ, సర్పంచులు, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.



## కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీనామాకు డిమాండ్

- **ఇండియా కూటమి ఆధ్వర్యంలో 'చలో లోక్‌భవన్'**

**పెద్దపల్లి మహా :** కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన 'చలో లోక్‌భవన్' కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా నుండి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు పాల్గొన్నారు. ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీలో పీసీసీ అధ్యక్షులు, మంత్రులు, ఇండియా కూటమి నేతలతో కలిసి విజయరమణరావు పాల్గొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై నిరసన వ్యక్తం చేస్తూ, ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీనామా చేయాలని కూటమి నేతలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు ప్రజాస్వామ్య పరిరక్షణ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం తమ పోరాటాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు.



## నేరస్తులకు శిక్ష పడేలా చర్యలు చేపట్టాలి

- **గంజాయి వినియోగదారులను గుర్తించాలి**
- **భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచన**



భద్రాద్రి కొత్తగూడెం, మహా: నాణ్యమైన దర్యాప్తుతో నేరస్తులకు శిక్ష పడేలా చర్యలు చేపట్టడంతో పాటుగా గంజాయి వినియోగదారులను గుర్తించి వారిని డిఅడిక్షన్ సెంటర్ కు తరలించాలని భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో గురువారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అధ్యక్షతన నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని నేర పరిస్థితులు పెండింగ్ కేసులు కేసుల దర్యాప్తు పురోగతి తదితర అంశాలపై పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా 2026 సంవత్సరానికి సంబంధించి కఠిన సేవ, సేవ, ఉత్తమ సేవ శౌర్య పతకాలు పొందిన పోలీసు అధికారులు సిబ్బందికి జిల్లా ఎస్పీ పతకాలను అందజేసి అభినందించారు. విధి నిర్వహణలో అంకిత భావం క్రమశిక్షణతో పనిచేస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం నేర సమీక్షలో ఎస్పీ మాట్లాడుతూ ప్రతి కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌కు అత్యంత ప్రాధాన్యతనిస్తూ నేరస్తులకు శిక్ష పడేలా చేసి బాధితులకు న్యాయం అందించడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. కేసుల దర్యాప్తులో జాప్యం నిర్లక్ష్యాన్ని సహించేది లేదని బాధ్యతారహితంగా వ్యవహరించే అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళలు బాలికలు చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని భరోసా కేంద్రం షీటీమ్స్ ద్వారా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. మహిళలపై నేరాలు పోక్సో ఎస్సీ ఎస్టీ కేసులు మిస్సింగ్ కేసులతో పాటు రౌడీ షీట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణా విక్రయం వినియోగంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గంజాయి వినియోగానికి అలవాటు పడిన వ్యక్తులను గుర్తించి వైద్యుల సూచనల మేరకు డిఅడిక్షన్ సెంటర్లకు తరలించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. గంజాయి వినియోగం వల్ల కలిగే అనర్థాలపై యువత విద్యార్థులు ప్రజలకు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. గంజాయి అక్రమ రవాణా విక్రయానికి సంబంధించిన హాట్ స్పాట్లను గుర్తించి నిరంతరం నిఘా కొనసాగించాలని అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజలకు నిరంతరం అవగాహన కల్పించాలని సైబర్ మోసాలకు సంబంధించిన ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి బాధితులకు అండగా నిలవాలని తెలిపారు. సైబర్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు సీసీటీఎన్ఎస్ 2.0లో పెండింగ్ వివరాలను సకాలంలో నమోదు చేయాలని నాట్ గ్రిడ్ గాండీవ వెబ్ అప్లికేషన్ల వినియోగాన్ని మరింత పెంచాలని అధికారులకు సూచించారు. జిల్లాలో సీసీటీవీ నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేసి కమాండ్ అండ్ కంట్రోల్ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. డయల్ 112కు వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు అవసరమైన సహాయం అందించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి సంబంధిత శాఖల సమన్వయంతో అవసరమైన నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రోడ్డు భద్రత ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు నిరంతరం అవగాహన కల్పించాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ర్యాష్ డ్రైవింగ్ తదితర ఉల్లంఘనలపై నిరంతరం వాహన తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన పోలీసింగ్ అందించేందుకు ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని నేరాల నియంత్రణతో పాటు బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, ఇల్లందు డీఎస్పీ వెంకన్న బాబు, డీసీఆర్‌బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్‌తో పాటు జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలు, బాలికల భద్రతలో షీ టీమ్స్ కీలక పాత్ర పోషించాలి

- **ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకోవాలి**
- **సీపీ అంబర్ కిషోర్ ఝా**



**పెద్దపల్లి మహా** : మహిళలు, బాలికలకు భద్రతపై భరోసా కల్పించడంతో పాటు పోలీసులపై నమ్మకాన్ని పెంపొందించడంలో షీ టీమ్స్ కీలక పాత్ర పోషించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. గురువారం కమిషనరేట్ కార్యాలయంలో షీ టీమ్స్, మహిళలు, పిల్లల రక్షణ, భరోసా కేంద్రాల సేవలపై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. కమిషనరేట్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో షీ టీమ్స్ అప్రమత్తంగా ఉండాలని, మహిళలను వేధించే ఆకతాయిలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. అందిన ఫిర్యాదులపై ఆధారాలు సేకరించి, నేరం జరిగినట్లు తేలితే వెంటనే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా 12 నుంచి 18 ఏళ్ల బాలికలకు వేధింపులు, సైబర్ నేరాలు, సామాజిక మాధ్యమాల దుర్వినియోగం, మంచి స్పర్శ-చెడు స్పర్శ వంటి అంశాలపై పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. బాధిత మహిళలు, చిన్నారులకు తక్షణ సహాయం అందించడంతో పాటు కౌన్సెలింగ్, వైద్య, న్యాయ, పునరావాస, సంక్షేమ సేవలు అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. బాధితుల పట్ల సానుభూతి, మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ వారికి ధైర్యం, భరోసా కల్పించాలన్నారు. ఫిర్యాదులపై కేసుల నమోదు విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయరాదని సీపీ స్పష్టం చేశారు. ఫిర్యాదులో నేరం ఉన్నట్లు తేలితే ముందుగా కేసు నమోదు చేసి, అనంతరం దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. బాధితుల పట్ల అలసత్వం ప్రదర్శించే అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు బాధితులకు నాణ్యమైన కౌన్సెలింగ్, రక్షణ, పునరావాస సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. షీ టీమ్స్ సిబ్బంది నిజాయితీ, పారదర్శకత, నిష్పక్షపాతంగా విధులు నిర్వహిస్తూ బాధితుల గోప్యతను కాపాడాలని తెలిపారు. మహిళలు, బాలికలు ఎలాంటి వేధింపులకు గురైనా భయపడకుండా పోలీసులను ఆశ్రయించేలా అవగాహన కల్పించాలని, వారి భద్రతకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించాలని సీపీ పేర్కొన్నారు. సమావేశంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, సీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ అనిల్, మంచిర్యాల మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, షీ టీమ్ ఎస్ఐలు హైమా, ఉషారాణి, లావణ్య, షీ టీమ్ సిబ్బంది, భరోసా కేంద్రం సభ్యులు పాల్గొన్నారు.



## టీబీ రహిత గ్రామంగా శాయంపేట ఎంపిక

**పెద్దపల్లి మహా** : ధర్మారం: టీబీ (క్షయ) వ్యాధి రహిత గ్రామంగా శాయంపేట గ్రామం ఎంపిక కావడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పెద్దపల్లి కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్, జిల్లా ఆరోగ్య శాఖ అధికారి, ధర్మారం మండల ఎంపీడీఓ, మెడికల్ ఆఫీసర్‌ల చేతుల మీదుగా శాయంపేట గ్రామానికి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శితో కలిసి ఈ ప్రశంసా పత్రాన్ని స్వీకరించారు. గ్రామంలో టీబీ వ్యాధి నియంత్రణకు, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేసిన ఏ ఎన్ ఎం , ఆశా వర్కర్‌లకు ఈ సందర్భంగా ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. వారి నిరంతర కృషి, సేవల ఫలితంగానే శాయంపేట గ్రామం టీబీ రహిత గ్రామంగా ఎంపికైందని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ గ్రామాన్ని టీబీ రహిత గ్రామంగా కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. శాయంపేట గ్రామాన్ని ఆరోగ్యవంతమైన గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్న ఆరోగ్య సిబ్బందికి గ్రామస్థులు అభినందనలు తెలిపారు.





# టి.జె.యం.యు .ఉపాధ్యక్షులుగా దమ్మపేట పాత్రికేయులు

**దమ్మపేట ,మహా** : తెలంగాణ జర్నలిస్టు మీడియా యూనియన్ (టి.జె.ఎం.యు ) నియోజకవర్గ ఉపాధ్యక్షులు గా దమ్మపేట కు చెందిన సున్నం శ్రీనివాసరావు (99టివి), నీలం రాజేశ్వరి (మనం), వనమాల శ్రీనివాసరావు (మీ వార్త) లు ఏకగ్రీవంగా నియమితులయ్యారు. అశ్వారావుపేట లో గురువారం టిజెఎంయు వ్యవస్థాపక అధ్యక్షులు ఇనపనూరి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ప్రథమ మహాసభ లో వీరిని నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీడియా స్వేచ్ఛకోసం ,హక్కులకోసం పోరాటం చేసి జర్నలిస్ట్ మిత్రులకు అండగా , యూనియన్ అభివృద్ధి కి శక్తి వంచన లేకుండా పనిచేస్తామని హామీ ఇచ్చారు. చక్కని అవకాశం ఇచ్చిన టిజెయంయు కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. దమ్మపేట కు చెందిన పలువురు పాత్రికేయులు గంగాధర్ శ్రీనివాస్ , చిన్నశెట్టి శ్రీనివాస్ ,ముత్యాలరావు ,చేడె శ్రీనివాస్ ,కారం నాగేంద్ర , డేవిడ్ ,చిరు , రమేష్ తదితరులు . హర్షం వ్యక్తం చేశారు

# మొయినాబాద్ మున్సిపాలిటీ 14వ వార్డులో తీవ్ర నీటి ఎద్దడి

- ప్రభుత్వం ఆదుకోక వాటర్ ఎయిడ్ ఇండియాను వేడుకున్న కౌన్సిలర్ కర్రోల్ల శ్రీధర్
- తాగునీటి కోసం అల్లాడుతున్న 300 కుటుంబాలు - బోరు, పైప్ లైన్ వేసి ఆదుకోవాలని విజ్ఞప్తి



**మొయినాబాద్ మహా**: మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు క్వార్టర్స్ వద్ద నెలకొన్న తీవ్ర నీటి కొరతకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం అందకపోవడంతో ఆ వార్డు కౌన్సిలర్ కర్రోల్ల శ్రీధర్ చివరకు వాటర్ ఎయిడ్ ఇండియా సంస్థను ఆశ్రయించారు. మొయినాబాద్ మున్సిపాలిటీ 14వ వార్డు క్వార్టర్స్ లో సుమారు 200 నుండి 300 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇక్కడ గతంలో నిర్మించిన 20 వేల లీటర్ల చిన్న గ్రౌండ్ వాటర్ ట్యాంక్ తప్ప ఓవర్ హెడ్ ట్యాంక్ లేదు. దీంతో ఇండ్లలోకి నీరు సరిగా రాక ప్రజలు నిత్యం తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. అంతేకాకుండా ఈ వార్డులో కనీసం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేదు, సరైన రోడ్లు లేవు, ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారం, చెట్ల పొదలు విపరీతంగా పెరిగిపోయి నిత్యం పాములు, తేళ్లు ఇండ్లలోకి వస్తున్నాయని, తాను స్వయంగా వార్డులో సమస్యలు అడగడానికి వెళ్తున్నప్పుడే తన కళ్ల ముందే పాము వచ్చిందని కౌన్సిలర్ తెలిపారు. ఇటీవల 15 రోజుల క్రితం కూడా ఒక వ్యక్తిని పాము కరవడంతో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారని, ప్రజలు ప్రాణభయంతో బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం తాను గెలిచిన నాటి నుండి సొంతంగా ఎస్టిమేషన్లు వేయించుకొని అధికారుల చుట్టూ, ప్రజాప్రతినిధుల చుట్టూ, ఎమ్మెల్యే, మంత్రుల చుట్టూ తిరుగుతున్నా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదని, మున్సిపల్ కౌన్సిల్ జరిగిన ప్రతి సమావేశంలోనూ ఈ విషయాన్ని లేవనెత్తినా తవ్వి పారేసిన పనులకే బడ్జెట్ లేదని కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందని ఆయన అన్నారు. దీంతో చేసేదేమీ లేక కౌన్సిలర్ కర్రోల్ల శ్రీధర్ 14వ వార్డు నివాసితులతో కలిసి వాటర్ ఎయిడ్ ఇండియా సంస్థ ప్రతినిధులను వార్డుకు పిలిపించి మాకు ప్రభుత్వం నుంచి ఏ సహాయం అందడం లేదు, దయచేసి మీరైనా మా వార్డులో ఒక బోరు మోటారు వేసి, కొత్త పైప్ లైన్ వేసి మా 300 కుటుంబాలకు నిత్యం తాగునీరు వచ్చేలాn చేయాలని బ్రతిమిలాడి వేడుకున్నారు. దీనికి స్పందించిన వాటర్ ఎయిడ్ ఇండియా సంస్థ వార్డులో జల్ సంకల్ప్ పేరుతో నీటి సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని నీటిని ఆదా చేయాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో వాటర్ ఎయిడ్ ఇండియా సంస్థ నుండి నెట్వర్క్ ఆర్గనైజర్ ఎండి వాహెద్ హాజరయ్యారు ఈ కార్యక్రమంలో గ్రామంలోని, ఎలుగని అశోక్ గౌడ్ ఎలుగని లోకేష్ గౌడ్, పాశం బాలరాజ్, సోమ రమేష్ యాదవ్, చాకలి హరి వార్డులోని మహిళలు పాల్గొన్నారు



# ఉరివేసుకొని యువకుడు మృతి

**వలిగొండ, మహా** : ఉరివేసుకొని యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని ఏదుల్లగూడెం గ్రామ శివారులో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజాపేట మండలం వసంతపురం గ్రామానికి చెందిన జంగిటి కర్ణాకర్ (25) ప్రస్తుతం ఏదుల్ల గూడెంలో నివాసముంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. గురువారం ఉదయం ఏదుల్లగూడెం శివారులోని నోముల రామచంద్రకు చెందిన వ్యవసాయ భూమిలో వేప చెట్టుకు చున్నీతో ఉరివేసుకొని మృతి చెందాడు.కర్ణాకర్ ఇంటర్ వరకు చదువుకొని అనంతరం చదువు మానివేసి కూలీ పనులు చేసుకుంటున్నాడు. గత కొంతకాలంగా మద్యానికి బానిసై తరచూ మద్యం సేవించేవాడని, మద్యం సేవించవద్దని కుటుంబ సభ్యులు పలుమార్లు మందలించినా వినేవాడు కాదని పోలీసులు తెలిపారు. రెండు రోజుల క్రితం మద్యం సేవించేందుకు డబ్బులు అడగగా తండ్రి జంగిటి బిక్షపతి డబ్బులు లేవని మందలించడంతో తన సెల్ ఫోన్‌ను విక్రయించి మద్యం సేవించినట్లు తెలిపారు. అనంతరం కొత్త సెల్‌ఫోన్ కొనుగోలు చేసేందుకు డబ్బులు అడగగా కుటుంబ సభ్యులు డబ్బులు లేవని చెప్పడంతో మనస్తాపానికి గురై ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు.కర్ణాకర్ వ్యవసాయ భూమిలో ఉరివేసుకొని మృతి చెందిన విషయాన్ని గుర్తించిన వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

# రాజకీయ స్వార్థం కోసం ఒక ఆడబిడ్డ జీవితంతో ఆడుకుంటారా?

- ఇబ్రహీంపట్నంలో బీఆర్ఎస్ కనుమరుగు అయ్యే రోజు వచ్చింది
- డిసిసి అధికార ప్రతినిధి బైరీక రమాకాంత్ రెడ్డి



**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 8 మహా**: బీఆర్ఎస్ ఎమ్మెల్యే గత 10 ఏళ్ళు అధికారంలో ఉండి గాడిద పళ్ళు తోమారా అని డిసిసి అధికార ప్రతినిధి బైరక రమాకాంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... గత పాలకులు నియోజకవర్గంలో ఒక్క రూపాయి అభివృద్ధి చేయలేదని దుయ్యబట్టారు. కానీ ఇప్పుడు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, నియోజకవర్గాన్ని వేల కోట్లతో అభివృద్ధి చేస్తూ, రోజుకు 18 గంటలు ప్రజల కోసం కష్టపడుతున్నారని కొనియాడారు. ఆయనకున్న ఆదరణ చూసి ఓర్వలేక, రాజకీయ మనుగడ కోసం ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయన్నారు.

**సోషల్ మీడియాలో తప్పడు ప్రచారాలు**

ఆర్టీసీ బస్సులో మహాలక్ష్మి పథకం అమలు గురించి తెలుసుకోవడానికి, ఎమ్మెల్యే గారు స్వయంగా బస్సులో ప్రయాణిస్తూ.. కూతురు వయసున్న ఒక విద్యార్థినితో ఆప్యాయంగా మాట్లాడి ఉచిత బస్ అమలు తీరును, బస్సులలో మహిళలకు ఇంకా కావలసిన సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. కానీ ఆ వీడియోని వక్రీకరించి, సోషల్ మీడియాలో బీఆర్ఎస్ పెయిడ్ బ్యాచ్ తప్పుడు ప్రచారం చేస్తోంది. మీ రాజకీయ స్వార్థం కోసం ఒక ఆడబిడ్డ జీవితంతో ఆడుకుంటారా? మీకు ఇంట్లో ఆడపడుచులు లేరా? అనే ప్రశ్నించారు. ఇలాంటి చీప్ ట్రిక్స్, మార్ఫింగ్ వీడియోలు, మల్ రెడ్డి రంగారెడ్డి దగ్గర సాగవు అని, రమాకాంత్ రెడ్డి హెచ్చరించారు.

# వెట్టిచాకిరీ నిర్మూలనపై విస్తృత అవగాహన కల్పించాలి

- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా**: 'స్వేచ్ఛా రథం'ను ప్రారంభించిన జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి. వెట్టిచాకిరీ (బాండెడ్ లేబర్) నిర్మూలనపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రాష్ట్రస్థాయి 'స్వేచ్ఛా రథం' ప్రచార కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి గురువారం జెండా ఊపి ప్రారంభించారు. వెట్టిచాకిరీ బాధితులు, అసంఘటిత రంగ కార్మికులకు తమ హక్కులు, అందుబాటులో ఉన్న సహాయ మార్గాలపై అవగాహన కల్పించడంతో పాటు టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 08069434343 ను విస్తృతంగా ప్రచారం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో వెట్టిచాకిరీని పూర్తిగా నిరోధించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని శాఖల సమన్వయంతో చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు. వెట్టిచాకిరీకి సంబంధించిన ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి, బాధితులను గుర్తించడం, వారిని రక్షించడం, అవసరమైన సహాయం మరియు పునరావాసం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వ్యవసాయం, ఇటుక బట్టీలు, ఆక్వాకల్చర్, గనులు-క్వారీలు తదితర అసంఘటిత రంగాల్లో వెట్టిచాకిరీకి గురయ్యే అవకాశాలు ఉన్నందున, 'స్వేచ్ఛా రథం' ద్వారా ఆయా ప్రాంతాల్లో ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కార్మికులు తమ హక్కులపై అవగాహన పెంచుకుని, ఎలాంటి ఒత్తిడి, బెదిరింపులు లేదా శ్రమ దోపిడీ ఎదురైనా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. అప్పులు, అడ్వాన్సులు, బెదిరింపులు, మోసం లేదా స్వేచ్ఛను హరించే విధంగా బలవంతంగా పని చేయించడం వెట్టిచాకిరీగా పరిగణించబడుతుందని, వెట్టిచాకిరీ చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. బాధితులను గుర్తించి, విముక్తి కల్పించి, పునరావాసం అందించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని తెలిపారు. 'స్వేచ్ఛా రథం' జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తూ కార్మికుల హక్కులు, వెట్టిచాకిరీని ఎలా గుర్తించాలి, ఎక్కడ ఫిర్యాదు చేయాలి, బాధితులకు ప్రభుత్వపరంగా లభించే సహాయం వంటి అంశాలపై అవగాహన కల్పించనుంది. 08069434343 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించడం ద్వారా వెట్టిచాకిరీ ఘటనలను అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో *కార్మిక శాఖ, పోలీసు/మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం (ఏహెచ్ టియు), జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డిఎల్ఎస్ఏ), మహిళా శిశు సంక్షేమ శాఖ (డబ్ల్యూసిడి) తో పాటు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఐఇసి ప్రచార సామగ్రి పంపిణీ, మీడియా మరియు సమాచార పౌర సంబంధాల శాఖల సహకారంతో అవగాహన కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించనున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాల్లో 'స్వేచ్ఛా రథం' ప్రచార కార్యక్రమం నిర్వహించబడుతోంది. జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో సంబంధిత శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయనున్నారు.

# పారిశుధ్య కార్మికులకు ఘన సన్మానం

- శాలువాలతో సత్కరించి.. పాదాభిషేకం.. సహపంక్తి భోజనం



**పెద్దపల్లి మహా** : భారతీయ జనతా పార్టీ కార్మిక విభాగం పెద్దపల్లి జిల్లా కన్వీనర్ తడగొండ నర్సయ్య ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులను శాలువాలతో సత్కరించి, పాదాభిషేకం నిర్వహించారు. అనంతరం వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ ఓబీసీ రాష్ట్ర నాయకురాలు కందుల సంధ్యారాణితో పాటు పలువురు పార్టీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికుల సేవలను కొనియాడుతూ, ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత కోసం వారు అందిస్తున్న సేవలు అభినందనీయమని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



# ఎట్టకేలకు శ్రీదేవికి న్యాయం..

**వర్ధన్నపేట,మహా :** వరంగల్ జిల్లా వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ సారంగపాణి కుమారుడు శ్రీకాంత్‌తో పెళ్లి చేయాలని కోరుతూ నాలుగు రోజులుగా దీక్ష చేస్తున్న దళిత యువతి శ్రీదేవికి ఎట్టకేలకు న్యాయం జరిగి ఆమె చేస్తున్న దీక్షకు ముగింపు పలికారు.స్థానిక ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు , వరంగల్ జిల్లా డిసిసి అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ చొరవతో శ్రీకాంత్, వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ సారంగపాణి కుటుంబ సభ్యులు పెళ్లికి అంగీకరించినట్లు తెలుస్తోంది. దీంతో నాలుగో రోజు దీక్షకు ముగింపు పలుకుతూ శ్రీకాంత్-శ్రీదేవి పెళ్లి దండలు మార్చుకున్నారు. ఈ పరిణామంతో దళిత సంఘాల ప్రతినిధులు, మహిళలు, వర్ధన్నపేట పట్టణవాసులు హర్షం వ్యక్తం చేశారు.నాలుగు రోజులుగా కొనసాగిన శ్రీదేవి దీక్షకు ఎట్టకేలకు తెరపడటంతో కుటుంబ సభ్యులు, మద్దతు దారుల్లో ఆనందం వెల్లి విరిసింది.



# ఐఎఫ్‌టీయూలో ఫస్ట్ జోన్ సివిక్ కార్మికులు చేరిక

- కండువాలు కప్పి ఆహ్వానించిన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బ్రహ్మానందం

**మందమర్రి, మహా** : మందమర్రి ఏరియా మార్కెట్ ప్రాంతానికి చెందిన ఫస్ట్ జోన్ సివిక్ కాంట్రాక్ట్ కార్మికులు సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఎస్.సీ.సీ.డబ్ల్యూ.యు.(ఐ.ఎఫ్.టి.యు.) లో చేరారు. బుధవారం వారికి యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డి బ్రహ్మానందం కండువాలు కప్పి సంఘంలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్.సీ.సీ.డబ్ల్యూ.యు.(ఐ.ఎఫ్.టి.యు.) 1995 నుండి కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల సాధన, సౌకర్యాల కోసం పోరాడుతోందన్నారు. కార్మికులకు ఎలాంటి హక్కులు లేనప్పుడు గోలేటి నుండి మణుగూరు వరకు కార్మికులను ఐక్యం చేసి ఆందోళనలు చేపట్టామన్నారు.ఐఎఫ్టియు మిలిటెంట్ ఆందోళనల ఫలితంగా సింగరేణిలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులకు సీఎంపీఎఫ్, బ్యాంకు వేతనాలు, జీవో ప్రకారం కనీస వేతనాలు, పని భద్రత సాధించుకున్నామని తెలిపారు. అయినప్పటికీ కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు ఫస్ట్ కేటగిరీ వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జేబీసీసీఐ సమావేశాలను న్యూఢిల్లీ, కోల్‌కతా, హైదరాబాద్, నాగ్‌పూర్‌లలో అడ్డుకున్నామన్నారు. ఈ ఆందోళన ఫలితంగా కాంట్రాక్ట్ కార్మికులకు హై పవర్ కమిటీ నిర్ణయించిన వేతనాలు చెల్లించాలని కోల్ ఇండియా యాజమాన్యం సర్క్యులర్ విడుదల చేసిందని, కానీ సింగరేణిలో ఈ వేతనాలు ఇక్కడ అమలు కావడం లేదన్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం అన్ని డిపార్ట్‌మెంట్ కార్మికులకు హై పవర్ కమిటీ వేతనాలు అమలు చేసే వరకు ఆందోళన చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ అధ్యక్ష కార్యదర్శులు టి శ్రీనివాస్, ఎం.డి జాఫర్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు మేకల సురేందర్, కార్మికులు చంటి పాల్గొన్నారు.



# అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ లో సెప్టిక్ ట్యాంకర్ల అన్లోడ్

**మొయినాబాద్ మహా**: మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్ నగర్ రెండో వార్డులో మాల ఈశ్వరయ్య ఇంటి ముందు అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పైకప్పు తీసి అందులో సెప్టిక్ ట్యాంక్ పైప్ వేసి అన్లోడ్ చేస్తుండగా గమనించిన స్థానికులు సెప్టిక్ ట్యాంక్ ను పట్టుకొని స్థానిక కౌన్సిలర్ బేగం బీ 3వ వార్డు కౌన్సిలర్ బిలపాటి కవిత ఎల్లేష్ కు సమాచారం అందించడంతో సెప్టిక్ ట్యాంక్ వద్దకు చేరుకున్న కౌన్సిలర్లు డ్రైవర్ను నిలదీయగా సిటీ నుండి తెచ్చి ఇక్కడ అన్లోడ్ చేస్తున్నామని గత వారంలో కూడా ఇక్కడే అన్లోడ్ చేసినట్టుగా తెలిపారు. వెంటనే స్థానిక మొయినాబాద్ పోలీసులకు సమాచారం అందించి పోలీసులకు అప్పగించడం జరిగిందని తెలిపారు. 3వ వార్డు కౌన్సిలర్ బిల్లపాటి కవిత ఎల్లేష్ మాట్లాడుతూ ఇప్పటికే ప్రజలు దోమల బెడదతో విష జ్వరాలతో బాధపడుతున్నారని మున్సిపల్ కార్మికులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ మోరీలను ఎప్పటికప్పుడు శుద్ధి చేయిస్తూ ఉంటే ఇలాంటి సెప్టిక్ ట్యాంకర్లు కాలనీలోకి వచ్చి అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పైకప్పు తెరచి సెప్టిక్ ట్యాంక్ పైపు అందులో వేసి అన్లోడ్ చేయడం ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు రోజుకు 20 నుండి 30 సెప్టిక్ ట్యాంకర్లు హిమాయత్ నగర్ మీదగా తిరుగుతూ ఉంటాయని అవి ఎక్కడి నుండి వస్తున్నాయి ఎక్కడ అన్లోడ్ చేస్తునయో మున్సిపల్ అధికారులు గమనించి చర్యలు తీసుకోవాలని కోరారు.

# కాంగ్రెస్ నేతలు రాజ్యాంగాన్ని అవమానపరుస్తున్నారు

- ఒక్కొక్కరికి ఒక్క ఓటు ఉండాలి.
- మృతులు, రెండు ఓట్లు ఉన్నవారి పేర్లనే తొలగిస్తున్నారు
- కందుల సంధ్యారాణి



**పెద్దపల్లి మహా** : గోదావరిఖని: కాంగ్రెస్ పార్టీ నేతలు భారత రాజ్యాంగాన్ని అవమానపరుస్తున్నారని భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి ఆరోపించారు. గురువారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఒక్కొక్కరికి ఒక్క ఓటు మాత్రమే ఉండాలని సంధ్యారాణి అన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర పరిశీలన ప్రక్రియకు ఎలాంటి రాజకీయ పార్టీతో సంబంధం లేదని పేర్కొన్నారు. మృతుల పేర్లు, ఒకరి పేరుతో రెండు ఓట్లు ఉన్న సందర్భాలను గుర్తించి వాటిని తొలగించే ప్రక్రియ కొనసాగుతోందని ఆమె తెలిపారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు, అనర్హమైన పేర్లను తొలగించడం ద్వారా ఎన్నికల ప్రక్రియను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజలు ఓటర్ల జాబితా పరిశీలన ప్రక్రియపై వాస్తవాలను తెలుసుకోవాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరి ఓటు హక్కు పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సంధ్యారాణి కోరారు.

# రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు బెల్లంపల్లి సీఈఓ విద్యార్థి ఎంపిక




**బెల్లంపల్లి, మహా:** రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు బెల్లంపల్లి సీఈఓ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ముడిమడుగుల హర్షిత్ అండర్ 19 విభాగంలో ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ విజయసాగర్ వెల్లడించారు ఈనెల 9వ తేదీ నుండి 11వ తేదీ వరకు ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలోని జడ్చర్ల మండలం రంగారెడ్డి గూడ లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలలో పాల్గొనడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా వ్యాయామ వైస్ ప్రిన్సిపాల్ తన్నీరు గోపి ,వ్యాయామ ఉపాధ్యాయులు అల్లూరి వామన్, ముచ్చకుర్తి రాజశేఖర్ లు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటున్న విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించి జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

# మూగజీవాల అక్రమ రవాణా.!



**ఆదిభట్ల అక్టోబర్ 8 మహా:** ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా మూగజీవాలను తరలిస్తున్న డీసీఎంను పట్టుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. బొంగుళూరులోని ప్రమిద కన్వెన్షన్ హాల్ వద్ద వాహన తనిఖీ నిర్వహించగా, ఇబ్రహీంపట్నం నుండి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఒక డీసీఎం వాహనాన్ని పోలీసులు అడగించి తనిఖీ చేయగా 17 ఆవులు, 8 ఎద్దులు, 13 దూడలను (మొత్తం 38 పశువులను) తాళ్లతో కట్టి వాటిని క్రూరంగా బంధించి హైదరాబాద్‌లోని బహదూర్‌పురా కబేళాకు తరలించే ప్రయత్నం చేశారని పోలీసులు తెలిపారు.

**అధిక లాభాలు అర్జించాలనే దురుద్దేశంతో....**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సదా వీర వెంకట మణికంఠ, డ్రైవర్ సంగప్ప ఇద్దరు కలిసి, ఆవులను, దూడలను వధశాలకు తరలించి, అధిక లాభాలు అర్జించాలనే దురుద్దేశంతో కొనుగోలు చేశారని అన్నారు. విశ్వాసనీయ సమాచారాన్ని అందుకున్న పోలీసులు, అక్రమంగా పశువులను తరలిస్తున్న డీసీఎం అదుపులోకి తీసుకుని, ఆ పశువులను రక్షించి, వాటి సంరక్షణ పోషణ కోసం ముచింతల్‌లోని ధ్యాన్ ఫౌండేషన్ గోశాలకు తరలించారు. ఇద్దరు వ్యక్తులను, డీసీఎం వాహనాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు, అవసరమైన చట్టపరమైన చర్యల కోసం నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.




# గాయత్రి విద్యానికేతన్‌లో ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు

**పెద్దపల్లి మహా** : గాయత్రి విద్యానికేతన్‌లో ప్రిప్రైమరీ విద్యార్థులకు ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. రంగురంగుల బతుకమ్మలతో సంప్రదాయ దుస్తుల్లో హాజరైన చిన్నారులు ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా బతుకమ్మ పండుగ విశిష్టత, ప్రకృతితో మన సంస్కృతి, సంప్రదాయాలకు ఉన్న అనుబంధాన్ని విద్యార్థులకు వివరించారు. బతుకమ్మ ఆటపాటల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొనడంతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. కార్యక్రమంలో గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్, కరస్పాండెంట్ రజనీతో పాటు ప్రైమరీ ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.



# ట్రాఫిక్ సమస్యలకు సమగ్ర ప్రణాళిక

- **కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**పెద్దపల్లి మహా** : పట్టణంలోని ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి అన్ని ప్రధాన జంక్షన్లను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి సమగ్ర ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో డీసీపీ రామ్‌రెడ్డితో కలిసి ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌పై సమీక్ష నిర్వహించారు. ట్రాఫిక్ రద్దీకి కారణాలను గుర్తించి, అవసరమైన ప్రాంతాల్లో వన్‌వే, టూవే విధానాలను ప్రయోగాత్మకంగా అమలు చేసి కనీసం వారం రోజుల పాటు ఫలితాలను పరిశీలించాలని సూచించారు. ట్రాఫిక్ డైవర్షన్ ప్రణాళికలను నిబంధనల ప్రకారం అమలు చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లపై పశువుల సంచారాన్ని నియంత్రించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, పోలీసు, మున్సిపల్, ఆర్అండ్‌బీ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా చేపట్టిన చర్యలను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. సమీక్షలో మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, ఆర్అండ్‌బీ ఈఈ భావ్‌సింగ్, ట్రాఫిక్ పోలీసు అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల నియంత్రణలో వరంగల్ కమిషనరేట్ ప్రత్యేక చర్యలు

- **నివేదికలు ప్రతి నెలా మీడియాకు విడుదల చేస్తాం**
- **వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత ఐపిఎస్**

**హనుమకొండ, మహా** : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరాల నియంత్రణ, బాధితులకు సత్వర సహాయం, మోసపోయిన నగదు రికవరీ, నేరస్థుల గుర్తింపు ప్రజల్లో సైబర్ అవగాహన కల్పించడంలో వరంగల్ కమిషనరేట్ పోలీసులు సమర్థవంతమైన చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సైబర్ నేరాలకు సంబంధించిన నెలవారీ పనితీరు నివేదికలను ఇక పై ప్రతి నెలా మీడియా ద్వారా విడుదల చేయనున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత ఐపిఎస్ తెలిపారు.

**ఎన్ సి ఆర్ పి**: 1 1 2026 నుండి 30 9 2026 వరకు, ఎన్ సి ఆర్ పి ద్వారా మొత్తం 3,952 ఫిర్యాదులు అందగా, వాటిలో 1155 ఫిర్యాదులు పరిష్కరించబడ్డాయి. అదేవిధంగా, 105 కేసులను గుర్తించి, 174 మంది నిందితులను అరెస్టు చేశారు. మిగిలిన ఫిర్యాదుల పై తదుపరి చర్యలు కొనసాగుతున్నాయి.

ఎన్ సి ఆర్ పి

గణాంకాల ప్రకారం, సైబర్ నేరాల కారణంగా బాధితులు సుమారు రూ.20.66 కోట్లు నష్టపోగా అదే విధంగా రూ. 5.23 కోట్లు బాధితులకు తిరిగి అందించబడ్డాయి. సమన్వయ ద్వారా పోలీస్ స్టేషన్లకు పంపిన 983 అభ్యర్థనల్లో 866 పూర్తయ్యాయి.

**జి ఆర్ ఎం..**

ప్రజలు బ్యాంకింగ్ సంబంధిత సమస్యలపై జి ఆర్ ఎం పోర్టల్ ద్వారా మొత్తం 104 ఫిర్యాదులు నమోదు చేయగా, వాటిలో 83 ఫిర్యాదులు పరిష్కరించబడ్డాయి.

**ఎం ఆర్ ఎం..**

ప్రజలు బ్యాంకింగ్ సంబంధిత సమస్యలపై ఎం ఆర్ ఎం ద్వారా మొత్తం 789 అభ్యర్థనలు నమోదు చేయగా, వాటిలో 615 అభ్యర్థనలు పరిష్కరించబడ్డాయి. ఈ ప్రక్రియ ద్వారా రూ.21.44 లక్షలు బాధితులకు తిరిగి అందించబడ్డాయి. సైబర్ నేరస్థుల గుర్తింపు కోసం నిర్వహించిన ముద్దాయి ప్రొఫైలింగ్ లో 116 అభ్యర్థనలను 100 శాతం పూర్తి చేశారు.

**సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమాలు..**

ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంచేందుకు జూన్, జూలై, ఆగస్టు 2026 లో మొత్తం 286 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సెప్టెంబర్ 2026లో వరంగల్ కమిషనరేట్ పరిధిలో ఎన్సీఆర్పి ద్వారా 483 సైబర్ ఫిర్యాదులు అందగా, 95 ఫిర్యాదులు పరిష్కరించబడి, 10 ఎఫ్ ఐ ఆర్ లు నమోదు చేయబడ్డాయి. ఎంఆర్ ఎం ద్వారా 285 అభ్యర్థనలు అందగా, బాధితుల నగదు కు సంబంధించి మొత్తం రూ.50.87 లక్షలు గుర్తించగా, రూ.49.56 లక్షలు బాధితులకు పునరుద్ధరించ బడ్డాయి. అదేవిధంగా, సైబర్ నేరాలకు పాల్పడిన 34 మంది నిందితులను వరంగల్ పోలీసులు అరెస్ట్ చేశారు.

సైబర్ మోసానికి గురైన వెంటనే 1930కు కాల్ చేసి, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని ఈ సందర్భంగా వరంగల్ కమీషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సత్వర ఫిర్యాదు ద్వారా మోసపోయిన నగదును నిలుపుదల చేసి బాధితులకు తిరిగి అందించే అవకాశం పెరుగుతుంది.అప్రమత్తంగా ఉండండి - సైబర్ నేరాల నుంచి సురక్షితంగా ఉండండి అని వరంగల్ సీపి పిలుపునిచ్చారు.



# రహదారుల పరిశుభ్రత, భద్రత పై ప్రత్యేక దృష్టి సారించాలి

- **ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలి**
- **అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్, బల్దియా ప్రత్యేకాధికారి**



**హనుమకొండ, మహా** : గ్రేటర్ వరంగల్ నగరంలో రహదారుల వెంట ఉన్న ఆక్రమణలను తక్షణమే తొలగించి, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. గురువారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్నతో కలిసి నగరంలోని కల్లుమండువా జంక్షన్, చింతగట్టు క్యాంపు, రామారం, కాకతీయ యూనివర్సిటీ రెండవ గేట్, ప్రధాన రహదారి తదితర ప్రాంతాల్లో పర్యటించి రహదారుల పరిస్థితి, ట్రాఫిక్, ఆక్రమణలు, పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. రహదారికి ఇరువైపులా ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగించే విధంగా ఏర్పాటు చేసిన బిల్‌బోర్డులు, ఫ్లెక్సీలు, డబ్బాలు తదితర ఆక్రమణలను గుర్తించి వెంటనే తొలగించాలని టౌన్ ప్లానింగ్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఇంజనీరింగ్ విభాగాల అధికారులను ఆదేశించారు. రహదారుల వెంట ఆక్రమణల కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటమే కాకుండా ప్రమాదాలకు అవకాశం ఉన్నందున, ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టి పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు, వాహనదారులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా నగరంలోని పారిశుద్ధ్య నిర్వహణను కూడా కలెక్టర్ పరిశీలించారు. రహదారులు, ప్రధాన కూడళ్లు, పరిసర ప్రాంతాల్లో నిత్యం పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తూ నగరాన్ని మరింత పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. డివైడర్లు, మీడియన్స్ మరమ్మతులు ఉన్నట్లయితే వెంటనే చేయించాలన్నారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న మాట్లాడుతూ రహదారుల వెంట ఆక్రమణలను గుర్తించి తొలగించడంతో పాటు, ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా సంబంధిత విభాగాల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. కలెక్టర్, కమిషనర్ వెంట సిఎంహెచ్వో డాక్టర్ రాజారెడ్డి, ఎస్ఈ రాజ్‌కుమార్, సీహెచ్వో లక్ష్మారెడ్డి, సిటీ ప్లానర్ రవీందర్ రెడేకర్, డిఎఫ్ఓ శంకర్ లింగం, ఈఈ రవి కుమార్ తో పాటు ఇంజనీరింగ్, పారిశుద్ధ్య, టౌన్ ప్లానింగ్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ తదితర విభాగాల అధికారులు ఉన్నారు.



# పేదింటి ఆడపడుచులకు వరం కల్యాణ లక్ష్మి పథకం

**వరంగల్ మహా** : 21వ డివిజన్ లోని ఎ1 ఫంక్షన్ హాల్ లో గురువారం 264 మంది లబ్ధిదారులకు 2కోట్ల 64 లక్షల 30,000 వేల 624రూపాయల కళ్యాణ లక్ష్మీ, షాది ముభారక్ చెక్కులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొండా సురేఖ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రివర్యులు కొండా సురేఖ మాట్లాడుతూ ఆడపిల్ల పెళ్లిలకు మేమున్నామని భరోసా ఇస్తూ ప్రభుత్వం పేదింటి అడబిడ్డల కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు.అందరికీ సమాన న్యాయం చేయడం, నిరుపేదల కుటుంబాలు వెలుగులు నింపడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా ముందుకు పోతున్నదని కొండా సురేఖ గారు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం, సంక్షేమం అభివృద్ధిపై దృష్టి సారించినట్లు తెలిపారు. అర్హులైన వారికి నూతన రేషన్ కార్డులు అందజేస్తున్నామని, ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, అర్హులు అధైర్యపడవలసిన అవసరం లేదని కొండా సురేఖ తెలిపారు.

# పోలీసులపై చర్యలు.. సీపీకి బీఆర్ఎస్ నేతల సలాం

- **సస్పెన్షన్‌ను స్వాగతిస్తూ సంబరాలు.. గౌష్ ఆలం చిత్రపటానికి పాలాభిషేకం**
- **టపాసులు కాల్చిన బీఆర్ఎస్ నాయకులు..**
- **నిష్పక్షపాత చర్యలను అభినందించిన కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి**



**తిమ్మాపూర్ మహా** : లంచం ఆరోపణలపై తిమ్మాపూర్ సీఐ, ఎస్సై, కానిస్టేబుల్ పై సస్పెన్షన్ వేటు వేయడాన్ని స్వాగతిస్తూ బీఆర్ఎస్ నాయకులు గురువారం కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లో సంబరాలు నిర్వహించారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం చిత్రపటానికి పాలాభిషేకం చేసి, టపాసులు కాల్చారు. పేద వ్యక్తి నుంచి లంచం డిమాండ్ చేశారనే ఆరోపణలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవడాన్ని వారు అభినందించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. "పేదవాడికి న్యాయం జరిగేలా వ్యవహరించిన పోలీస్ కమిషనర్‌కు సలాం" అంటూ వారు నినాదాలు చేశారు.

**పేదుడి ఫిర్యాదుపై చర్యలకు హర్షం**

తిమ్మాపూర్ మండల కేంద్రానికి చెందిన బాబు వాహనాల విడుదల వ్యవహారంలో లంచం డిమాండ్ చేశారనే ఆరోపణలు పోలీస్ శాఖలో కలకలం రేపాయి. జేసీబీ, ట్రాక్టర్లను విడుదల చేసేందుకు రూ.లక్ష డిమాండ్ చేశారని బాబు ఆరోపించాడు. ఈ వ్యవహారంపై పత్రికల్లో కథనాలు రావడంతో ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. తొలుత తిమ్మాపూర్ సీఐ బొల్లం రమేష్, ఎల్ఎండీ ఎస్సై అన్వర్‌తోపాటు ఓ కానిస్టేబుల్‌ను ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు. అనంతరం అడ్మిన్ డీసీపీ ఆధ్వర్యంలో విచారణ జరిపి నివేదిక సమర్పించారు. ఆరోపణలు రుజువైనట్లు తేలడంతో తాజాగా ముగ్గురిపై సస్పెన్షన్ చర్యలు తీసుకున్నారు.

**సీపీ చిత్రపటానికి పాలాభిషేకం**

ఈ చర్యలను స్వాగతిస్తూ బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేకంగా కార్యక్రమం నిర్వహించడం స్థానికంగా ఆసక్తికరంగా మారింది. గౌష్ ఆలం చిత్రపటానికి పాలాభిషేకం చేసి, అనంతరం టపాసులు కాల్చారు. ఒక పేద వ్యక్తి విషయంలో పోలీస్ శాఖ నిష్పక్షపాతంగా వ్యవహరించిందని పేర్కొంటూ సీపీని అభినందించారు.

'నిష్పక్షపాత చర్యలు అభినందనీయం'

ఈ సందర్భంగా కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. నిరుపేద వ్యక్తిని లంచం పేరిట వేధించారనే ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. పోలీస్ కమిషనర్‌కు తమ తరఫున సలాం చేస్తున్నామని తెలిపారు. పోలీస్ కమిషనర్ అత్యుత్తమంగా విధులు నిర్వర్తిస్తున్నారని నిక్కచ్చిగా పనిచేస్తున్నారని అభినందించారు . పేదల విషయంలో అధికారులు మరింత బాధ్యతగా వ్యవహరించాలని, పోలీసులతోపాటు రెవెన్యూ, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు కూడా ప్రజలకు పారదర్శకంగా సేవలందించాలని కోరారు. అవినీతికి పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేసే అధికారులు తమ చర్యలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు.

# టిబి ముక్త్ భారత్ కోసం యువత భాగస్వాములు కావాలి

- **టిబి నిర్మూలన పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి**
- **ప్రతి గ్రామాన్ని టిబి రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి**
- **వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**




**వరంగల్, కలెక్టరేట్ మహా** : టిబి ముక్త్ భారత్ సాధనలో యువత, ఎన్‌సీసీ క్యాడెట్లు, మై భారత్ వాలంటీర్లు చురుకుగా భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పిలుపునిచ్చారు. టిబి నిర్మూలనలో ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు అనుమానిత కేసులను గుర్తించి సకాలంలో పరీక్షలు, చికిత్స అందేలా చూడాలని సూచించారు. వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం నిర్వహించిన 'టిబి ముక్త్ భారత్ ఆయుష్మాన్ కోసం జోష్ టీముల' కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్షయ వ్యాధి బ్యాక్టీరియా వల్ల కలిగే అంటువ్యాధి అని, ప్రధానంగా గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందని కలెక్టర్ తెలిపారు. చికిత్స పొందని టిబి రోగులు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు వెలువడే సూక్ష్మక్రిముల ద్వారా ఇతరులకు వ్యాధి సోకే అవకాశం ఉందన్నారు. రెండు వారాలకు మించి తగ్గని దగ్గు, జ్వరం, రాత్రిపూట చెమటలు, బరువు తగ్గడం, ఆకలి తగ్గడం, నీరసం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. ఇలాంటి లక్షణాలు ఉన్నవారు సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి కఫ పరీక్షలు చేయించుకోవాలని, అవసరమైన వారికి వైద్యుల సూచన మేరకు ఛాతీ ఎక్స్‌రే తదితర పరీక్షలు నిర్వహించి వ్యాధిని నిర్ధారించు కోవాలని తెలిపారు. టిబి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం ఉచితంగా అందించే చికిత్సను వైద్యుల సూచనల మేరకు పూర్తిగా తీసుకుంటే వ్యాధి నయం అవుతుందని పేర్కొన్నారు.

**డ్రగ్ రెసిస్టెంట్ టిబి పై అప్రమత్తత అవసరం**

డ్రగ్ రెసిస్టెంట్ టిబి పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. మందులను సక్రమంగా, నిర్దేశించిన కాలం పాటు తీసుకోకపోతే ఔషధ నిరోధకత ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. డ్రగ్ రెసిస్టెంట్ టిబి ఉన్నవారు వైద్యుల సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ చికిత్సను పూర్తి చేయాలని సూచించారు. బమీణ ప్రాంతాల్లో టిబిపై అవగాహన కల్పించడంలో జోష్ టీములు, ఎన్‌సీసీ క్యాడెట్లు, యువత కీలక పాత్ర పోషించాలని అన్నారు. గ్రామాల్లో టిబి స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహించి అనుమానిత కేసులను గుర్తించడం, అవసరమైన పరీక్షలు చేయించడం, వ్యాధి నిర్ధారణ అయిన వారికి చికిత్స అందేలా చూడాలని సూచించారు. ప్రతి గ్రామాన్ని టిబి రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు సర్పంచులు, ప్రజాప్రతినిధులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, మై భారత్ వాలంటీర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లు, యువత, ప్రభావశీల వ్యక్తుల సహకారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆరోగ్యశాఖతో పాటు అన్ని లైన్ డిపార్ట్‌మెంట్లు సమన్వయంతో పనిచేసి వరంగల్ జిల్లాను టిబి రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలని అన్నారు.

**టిబి రహిత గ్రామాల సర్పంచులకు సన్మానం**

టిబి ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో టిబి రహిత గ్రామాలుగా గుర్తించబడిన గ్రామాల సర్పంచులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి శాలువాలతో ఘనంగా సత్కరించి టిబి ముక్త్ భారత్ గ్రామాల సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం టిబి నిర్మూలన పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి, నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యా రాణి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఐ. ప్రకాష్, డాక్టర్ ఆర్. రాజమౌళి, డాక్టర్ సాజిదా అతహరి, డాక్టర్ అరుణ్ జోషి, డిప్యూటీ డెమో ఎస్. వెంకటేశ్వర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రత్యేక అధికారులు, టిబి రహిత గ్రామాల సర్పంచులు, వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఎన్‌సీసీ కమాండర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లు, మై భారత్ వాలంటీర్లు, విద్యార్థులు, టిబి విభాగ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులు ఆయిల్‌పామ్ పంటలు సాగు చేయాలి




**వరంగల్, గీసుగొండ మహా** : ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల్లో ఆయిల్‌పామ్ రైతులు భూగర్భ జలాలు, నీటి వనరులను సంరక్షించుకుంటూ బిందు సేద్యం ద్వారా శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. తక్కువ నీటితో అధిక లాభాలు పొందే పంటల వైపు రైతులు దృష్టి సారించాలని, జిల్లాలో ఎగుమతులకు అవకాశమున్న పంటలను ప్రోత్సహించాలని అన్నారు. గీసుకొండ మండలం కొనేమాకులలోని పీడీఆర్ గార్డెన్స్‌లో గురువారం వరంగల్ జిల్లా ఆయిల్‌పామ్ రైతుల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. అధిక నీటి వినియోగం అవసరమయ్యే పంటల వైపు వెళ్లకుండా, నీటి పొదుపు పద్ధతులను అవలంబించాలని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగులో ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల పై జాతీయ ఆయిల్‌పామ్ పరిశోధన సంస్థ, పెదవేగి, ఏలూరు జిల్లా నుంచి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వి. ప్రసాద్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు వివరించారు. ముఖ్యంగా నీటి యాజమాన్యం, ఎరువుల యాజమాన్యం, పరాగసంపర్క కీటకాల వినియోగం, గెలల అభివృద్ధి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త రాజు పోషకాల యాజమాన్యం పై రైతులకు సూచనలు అందించారు.జిల్లా ఉద్యాన అధికారి ఆర్. శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచడంతో పాటు రైతుల ఆర్థికాభివృద్ధికి ఉద్యానశాఖ అందిస్తున్న రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయిల్‌పామ్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, వెంకట్ రెడ్డి, ఉద్యాన అధికారులు రాకేష్, జ్యోతి, మానస తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి సుమారు 400 మంది రైతులు అవగాహన సదస్సుకు హాజరయ్యారు.

# మృతుల కుటుంబాలకు ఆత్మీయ పరామర్శ

**డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి**

**ఆత్మకూరు, మహా;** హనుమకొండ జిల్లా ఆత్మకూరు గ్రామానికి చెందిన కి.శే. పొదిల సమ్మక్క ఇటీవల మరణించగా విషయం తెలుసుకున్న హనుమకొండ డిసిసి అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామిరెడ్డి గురువారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి తన గాఢ సానుభూతిని తెలియజేశారు. అదే గ్రామానికి చెందిన న్యాయవాది తనుగుల సన్నీ తండ్రి కి.శే తనుగుల సాంబయ్య నిన్న కన్నుమూశారు. ఈ విషయం తెలుసుకున్న ఇనగాల వారి ఇంటికి వెళ్లి, సాంబయ్య పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పర్వతగిరి రాజు మహేశ్వరి, రేవూరి జైపాల్ రెడ్డి, పలువురు స్థానిక నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



# బిగ్‌బాస్ ఇంట్లో మరోసారి వివాదాలు

**హైదరాబాద్, మహా:** బిగ్‌బాస్ తెలుగు సీజన్ 10లో రోజురోజుకూ ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. 31వ రోజు ఎపిసోడ్‌లో ఇంటి సభ్యుల మధ్య మాటల యుద్ధం, వ్యక్తిగత అంశాలపై చర్చలు, నామినేషన్లకు సంబంధించిన పరిణామాలు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించాయి. ముఖ్యంగా అపూర్వ, శాలినిల మధ్య చోటుచేసుకున్న వాగ్వాదం ఇంట్లో వాతావరణాన్ని వేడెక్కించింది.ఇప్పటికే నామినేషన్లలో ఉన్న సభ్యుల్లో ఉత్కంఠ కొనసాగుతుండగా.. వారి పరిస్థితిని మరింత ఆసక్తికరంగా మార్చేలా బిగ్‌బాస్ కొత్త ట్విస్ట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఎవరు సేఫ్ అవుతారు? ఎవరి ప్రయాణం ముగిసే అవకాశం ఉంది? అనే అంశాలపై ఇంటి సభ్యులతో పాటు ప్రేక్షకుల్లోనూ ఆసక్తి నెలకొంది. మరోవైపు సుధీర్ వివాహానికి సంబంధించిన అంశం కూడా ఇంట్లో చర్చకు వచ్చింది. వ్యక్తిగత విషయాలు ప్రస్తావనకు రావడంతో సభ్యుల మధ్య సంభాషణలు భావోద్వేగంగా మారాయి. కొందరు సభ్యులు తమ అభిప్రాయాలను స్పష్టంగా వెల్లడించగా.. మరికొందరు పరిస్థితిని సర్దుబాటు చేసే ప్రయత్నం చేశారు. బిగ్‌బాస్ హౌస్‌లో ప్రతి రోజు మారుతున్న సమీకరణాలు పోటీని మరింత రసవత్తరంగా మారుస్తున్నాయి. స్నేహాలు, విభేదాలు, వ్యూహాలు, నామినేషన్లు ఇలా ప్రతి అంశం ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. 31వ రోజు ఎపిసోడ్‌లో జరిగిన పరిణామాలు రాబోయే రోజుల్లో ఇంటి సభ్యుల మధ్య సంబంధాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయన్నది ఆసక్తికరంగా మారింది.



# పచ్చని గౌనులో పార్వతి..

మలయాళ నటి పార్వతి తిరువోత్ తాజాగా చేసిన ఫొటోషూట్‌కు సంబంధించిన చిత్రాలు సోషల్ మీడియాలో సందడి చేస్తున్నాయి. టీల్కలర్‌లో ఉన్న స్ట్రాప్‌లెస్ గౌన్‌లో ఆమె కొత్త లుక్‌లో కనిపించారు. గౌన్‌కు ఉన్న రఫుల్స్, ప్రత్యేకమైన డిజైన్ ఆమె లుక్‌కు మరింత ఆకర్షణను తీసుకొచ్చాయి. దీనికి బ్లాక్ గ్లౌజులు, జీబ్రా ప్రింట్ హీల్స్‌ను జత చేసి స్టైలిష్‌గా కనిపించారు. కర్లీ హెయిర్, సింపుల్ మేకప్‌తో ఫొటోలకు పోజులిచ్చిన పార్వతి తనదైన స్టైల్‌తో ఆకట్టుకున్నారు. మినిమలిస్ట్ స్టూడియో బ్యాక్‌డ్రాప్‌లో తీసిన ఈ ఫొటోలు ప్రస్తుతం అభిమానులను ఆకర్షిస్తున్నాయి.



# నాని నితిన్‌ల సినిమాలపై కొత్త అప్‌డేట్

**హైదరాబాద్, మహా:** టాలీవుడ్‌లో వరుస సినిమాలతో బిజీగా ఉన్న హీరోలు నాని, నితిన్ తమ తదుపరి చిత్రాలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ ఇద్దరు హీరోల సినిమాలకు సంబంధించిన విడుదల తేదీలపై తాజాగా సినీ వర్గాల్లో చర్చ మొదలైంది. నాని నటిస్తున్న 'ది ప్యారడైజ్'పై ఇప్పటికే భారీ అంచనాలు ఉండగా.. నితిన్ నటిస్తున్న 'అలియాస్ రుక్మిణి' కూడా ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌గా నిలుస్తోంది. నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో రూపొందుతున్న 'ది ప్యారడైజ్' భారీ స్థాయిలో తెరకెక్కుతోంది. 'దసరా' తర్వాత ఈ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో అభిమానుల్లో మొదటి నుంచే ఆసక్తి నెలకొంది. యాక్షన్, ఎమోషన్, రా అండ్ రస్టిక్ అంశాలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలు సూచిస్తున్నాయి. సినిమా విడుదల విషయంలో గతంలో పలు రకాల వార్తలు వచ్చినప్పటికీ.. సెప్టెంబర్ 24, 2026న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం స్పష్టం చేసింది. మరోవైపు నితిన్ నటిస్తున్న 'అలియాస్ రుక్మిణి'పై కూడా సినీ ప్రేక్షకుల్లో ఆసక్తి పెరుగుతోంది. విభిన్నమైన కథాంశంతో రూపొందుతున్న ఈ సినిమా విడుదల తేదీపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. నితిన్ వరుసగా కొత్త తరహా కథలను ఎంచుకుంటుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై కూడా అంచనాలు ఏర్పడ్డాయి. నాని విషయానికి వస్తే.. 'ది ప్యారడైజ్'లో కయాదు లోహర్ కథానాయికగా నటిస్తున్నారు. మోహన్‌బాబు, రాఘవ్ జుయల్, సంపూర్ణేష్ బాబు తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నారు. రెండు సినిమాల విడుదల తేదీలపై స్పష్టత కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా నాని సినిమా పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుండటంతో వివిధ భాషల్లోనూ దీనిపై ఆసక్తి కనిపిస్తోంది. నితిన్ చిత్రం కూడా విడుదల తేదీ ఖరారైన వెంటనే ప్రమోషన్ కార్యక్రమాలను వేగవంతం చేసే అవకాశం ఉంది. అధికారిక ప్రకటన వచ్చిన తర్వాత ఈ రెండు సినిమాల రిలీజ్ ప్లానింగ్‌పై మరింత స్పష్టత రానుంది.



# ఎన్టీఆర్ సినిమాపై ఫ్యాన్స్‌లో టెన్షన్



**హైదరాబాద్, మహా:** మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ చిత్రం మరోసారి వార్తల్లో నిలిచింది. ఈ ప్రాజెక్ట్‌కు 'గాడ్ ఆఫ్ వార్' అనే టైటిల్ ప్రచారంలో ఉన్నప్పటికీ.. అధికారికంగా టైటిల్‌ను ఇంకా ఖరారు చేయలేదని త్రివిక్రమ్ ఇప్పటికే స్పష్టం చేశారు. అయితే సినిమా కథ, నేపథ్యంపై వస్తున్న వార్తలు మాత్రం అభిమానుల్లో భారీ అంచనాలు పెంచుతున్నాయి. ప్రస్తుతం ఎన్టీఆర్ తన తదుపరి చిత్రాల విషయంలో వరుసగా భారీ ప్రాజెక్టులను ఎంచుకుంటున్నారు. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న 'డ్రాగన్' తర్వాత త్రివిక్రమ్ దర్శకత్వంలో సినిమా చేయనున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే త్రివిక్రమ్‌ఎన్టీఆర్ కాంబినేషన్‌పై అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రాజెక్ట్ స్క్రిప్ట్ సిద్ధంగా ఉందని త్రివిక్రమ్ వెల్లడించడం ఈ అంచనాలను మరింత పెంచింది. అయితే తాజాగా త్రివిక్రమ్ దర్శకత్వంలో వెంకటేష్‌తో రూపొందుతున్న 'ఆదర్శ కుటుంబం' సినిమా విషయంలో చోటుచేసుకున్న ఆలస్యాలు, రీషూట్‌లపై సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలోనే ఎన్టీఆర్ అభిమానుల్లో కొంత ఆందోళన మొదలైనట్లు కథనాలు వెలువడుతున్నాయి. సాధారణ కమర్షియల్ చిత్రానికే నిర్మాణ ప్రక్రియలో ఎక్కువ సమయం పడితే.. భారీ పౌరాణిక లేదా మైథలాజికల్ నేపథ్యంతో తెరకెక్కనున్న ఎన్టీఆర్ సినిమా పూర్తి కావడానికి ఎంత సమయం పడుతుందనే ప్రశ్నలు అభిమానుల్లో వినిపిస్తున్నాయి. మరోవైపు ఈ సినిమా సాధారణ కమర్షియల్ కథ కాకుండా భారీ స్థాయి మైథలాజికల్ యాక్షన్ ప్రాజెక్ట్‌గా ఉండొచ్చనే ప్రచారం కొనసాగుతోంది. కథకు తగ్గట్టుగా విస్తృతమైన సెట్స్, భారీ విజువల్స్, ప్రత్యేకమైన నిర్మాణ విలువలు అవసరమయ్యే అవకాశం ఉంది. అందువల్ల షూటింగ్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులకు కూడా ఎక్కువ సమయం కేటాయించాల్సి రావచ్చని సినీ అభిమానులు భావిస్తున్నారు. త్రివిక్రమ్‌కు పౌరాణిక అంశాలపై ఆసక్తి ఉన్న విషయం తెలిసిందే. ఆయన భవిష్యత్ ప్రాజెక్టుల్లో మైథలాజికల్ కథలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారనే చర్చ కూడా గతంలో జరిగింది. ఎన్టీఆర్‌తో చేయనున్న ప్రాజెక్ట్ కూడా అదే దిశలో ఉంటుందనే వార్తలు సినిమాపై క్యూరియాసిటీని పెంచుతున్నాయి. అయితే ప్రస్తుతం ప్రచారంలో ఉన్న కథ, పాత్రలు, టైటిల్, నటీనటుల వివరాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. కేవలం సోషల్ మీడియాలో, సినీ వర్గాల్లో వస్తున్న వార్తల ఆధారంగా సినిమాకు సంబంధించిన తుది వివరాలను నిర్ధారించడం సాధ్యం కాదు. అధికారిక ప్రకటన వచ్చిన తర్వాతే ప్రాజెక్ట్‌పై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే ఎన్టీఆర్‌త్రివిక్రమ్ కాంబినేషన్‌కు భారీ క్రేజ్ ఉండటంతో.. ఈ సినిమా ఎప్పుడు ప్రారంభమవుతుంది? కథ ఎలా ఉండబోతోంది? ఎన్టీఆర్ ఎలాంటి పాత్రలో కనిపించనున్నారు? అనే ప్రశ్నలు అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. భారీ అంచనాల మధ్య రూపుదిద్దుకోనున్న ఈ ప్రాజెక్ట్‌పై రాబోయే అధికారిక అప్‌డేట్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# టామ్ క్రూజ్ 'డిగ్గర్'కు భారీ షాక్

**హైదరాబాద్, మహా:** హాలీవుడ్ స్టార్ హీరో టామ్ క్రూజ్‌కు బాక్సాఫీస్ వద్ద ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. ఆస్కార్ విజేత దర్శకుడు అలెజాండ్రో జి. ఇనారిటు తెరకెక్కించిన 'డిగ్గర్' చిత్రం భారీ అంచనాల మధ్య విడుదలై.. ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. తొలి వారాంతంలోనే ఈ సినిమా వసూళ్లు తీవ్రంగా పడిపోవడంతో హాలీవుడ్ ట్రేడ్ వర్గాల్లో చర్చ మొదలైంది. మ్ క్రూజ్ వంటి అంతర్జాతీయ స్టార్ నటించిన సినిమా కావడంతో 'డిగ్గర్'పై మొదటి నుంచే భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అందుకు తోడు ఇనారిటు దర్శకత్వం వహించడంతో ఇది అవార్డుల రేసులో నిలిచే చిత్రంగా భావించారు. అయితే సినిమా విడుదలైన తర్వాత వచ్చిన సమీక్షలు ఆశించినంతగా లేకపోవడంతో పాటు.. ప్రేక్షకుల నుంచి కూడా మిశ్రమ స్పందన లభించింది. దీంతో బాక్సాఫీస్ వద్ద సినిమా ప్రారంభం నుంచే బలహీనంగా సాగింది. ఉత్తర అమెరికాలో 'డిగ్గర్' తొలి వారాంతంలో సుమారు 8 మిలియన్ డాలర్లు మాత్రమే వసూలు చేసింది. అంతర్జాతీయ మార్కెట్లలో మరో 12 మిలియన్ డాలర్లు రాబట్టడంతో ప్రపంచవ్యాప్తంగా ప్రారంభ వసూళ్లు దాదాపు 20 మిలియన్ డాలర్లకు చేరాయి. భారీ స్థాయి చిత్రానికి ఈ కలెక్షన్లు చాలా తక్కువగా ఉండటంతో నిర్మాణ సంస్థకు ఆర్థికంగా గట్టి దెబ్బ తగిలే పరిస్థితి ఏర్పడింది .ఈ సినిమాకు నిర్మాణ వ్యయం సుమారు 125 నుంచి 180 మిలియన్ డాలర్ల మధ్య ఉన్నట్లు వివిధ నివేదికలు పేర్కొంటున్నాయి. దీనికి అదనంగా ప్రచారం, మార్కెటింగ్ కోసం భారీ మొత్తాన్ని ఖర్చు చేసినట్లు సమాచారం. తాజా అంచనాల ప్రకారం సినిమా థియేట్రికల్ రన్ పూర్తయ్యే సమయానికి స్టూడియోకు భారీ నష్టం వచ్చే అవకాశం ఉందని ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు. కొన్ని అంచనాలు ఈ నష్టాన్ని 150 నుంచి 250 మిలియన్ డాలర్ల వరకు పేర్కొంటున్నాయి. 'డిగ్గర్'లో టామ్ క్రూజ్ ఓ శక్తివంతమైన చమురు వ్యాపారవేత్త పాత్రలో కనిపించారు. పర్యావరణ సంక్షోభం, వ్యాపార ప్రయోజనాలు, మానవ నిర్ణయాల ప్రభావం వంటి అంశాలను వ్యంగ్య ధోరణిలో కథలో చూపించినట్లు సమాచారం.



# బ్లాక్ శారీలో ప్రియ వడ్లమాని

**హైదరాబాద్, మహా:** తెలుగు సినీ ప్రేక్షకులకు పరిచయమైన నటి ప్రియ వడ్లమాని తాజాగా తన ఫొటోషూట్‌తో మరోసారి ఆకట్టుకున్నారు. నల్లటి శారీలో సంప్రదాయ అందానికి గ్లామర్ టచ్ ఇస్తూ కనిపించిన ఆమె ఫొటోలు సోషల్ మీడియాలో సందడి చేస్తున్నాయి. సింపుల్‌గా ఉన్నప్పటికీ స్టైలిష్‌గా కనిపించేలా ఆమె లుక్‌ను తీర్చిదిద్దుకున్నారు.బ్లాక్ శారీకి సరిపోయేలా ప్రత్యేకంగా డిజైన్ చేసిన బ్లౌజ్‌ను ధరించిన ప్రియ.. తక్కువ ఆభరణాలతోనే తన లుక్‌ను పూర్తి చేశారు. సహజమైన మేకప్, అందమైన హెయిర్‌స్టైల్‌తో కెమెరా ముందు పోజులిచ్చారు. శారీపై ఉన్న డిజైన్, బ్లౌజ్‌లోని వివరాలు ఆమె లుక్‌కు మరింత ఆకర్షణను తీసుకొచ్చాయి.సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉండే ప్రియ వడ్లమాని తరచూ తన ఫొటోషూట్‌లను అభిమానులతో పంచుకుంటుంటారు. ఆమె షేర్ చేసే ఫొటోలకు నెటిజన్ల నుంచి మంచి స్పందన వస్తుంటుంది. తాజాగా బ్లాక్ శారీలో కనిపించిన ఫొటోలు కూడా అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.సాంప్రదాయ దుస్తుల్లోనూ ఆధునిక స్టైల్‌ను చూపించగల తన ప్రత్యేకతను ఈ ఫొటోషూట్‌లో ప్రియ మరోసారి చాటుకున్నారు. ఎలాంటి హంగామా లేకుండా సింపుల్ లుక్‌లోనే ఆకట్టుకోవడంతో అభిమానులు ఆమె స్టైల్‌ను ప్రశంసిస్తున్నారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com